2014 నవంబర్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | | 02 |
| | ఎడిటర్ | |
| అపోస్తులుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| క్రైస్తవులు భయపడతగునా | | |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 10 |
| ఎలీసబెతు | శ్రీమతి రేచల్ జోసఫ్‌గారు | 12 |
| నీవు అతిసుందరమైనదానవు | | 14 |
| | శ్రీమతి మాధురిమరియన్ | |
| దేవుడు పండుగల ద్వారా మాట్లాడును | | 16 |
| | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | |
| జర్మనీనందలి మొరావియన్ సువార్త ఉజ్జీవము | | 18 |
| | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | |
| మదర్‌థెరిసా | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 21 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |


**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 100/-

పోషక చందా రూ. 500/-

జీవిత చందా రూ. 1000/-

విడి ప్రతి రూ. 10/-

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**మా చిరునామా :**

ఎడిటర్

పరిశుద్ధత

పోస్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియమైన పాఠకులకు శుభాభివందనములు.

చాలామంది పాఠకులు క్రమముగా చందాలు పంపు తున్నారు. వారికి మా హృదయపూర్వక ధన్యవాదములు. అయితే మేము వారికి కృతజ్ఞత ఉత్తరములు వ్రాయలేక పోవుచున్నాము. కారణం ఏంటంటే, From అడ్రస్ తెలిపే భాగము మనియార్డర్ ఫారంలో ఉండటం లేదు. కాబట్టి దయచేసి మీరు మనియార్డర్ పంపిన వెంటనే దయచేసి ఈ క్రింది నంబర్లలో దేనికైనా ఫోన్‌చేసి వివరాలు తెలియజేయవలసినదిగా మనవి.

ప్రస్తుతం ప్రపంచ పరిస్థితి దారుణంగా ఉంది. అందులోను క్రైస్తవుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ మధ్యకాలంలో తిరుపతిలో జరిగిన సంఘటన అందరికీ తెలిసిందే. బుద్ధిహీనముగా ఒక సంఘకాపరి పలికిన వాక్యాలు భారత దేశమంతా అలజడి రేపింది. తోటి హిందూ సహోదరుల మనోభావాలను దెబ్బతీసింది. స్వప్రయోజనం కొరకు పలికే బుద్ధిహీనమైన మాటలు ఎంత కీడు చేస్తాయో ఆలోచించండి. దీనివలన దేవుని నామము దూషింపబడినది. సువార్త పరిచర్య కార్యక్రమములకు ఆటంకము కలుగుతుంది. కనుక క్రైస్తవులందరికి మనవి ఏమంటే సంఘకాపరులు కాని సువార్తికులు గాని విశ్వాసులు కాని పరమత దూషణ చేయరాదని బ్రతిమిలాడుచు ప్రార్థిస్తున్నాను. ఇటువంటి సంఘటనలు సేవాకార్యక్రమములకు బహు ఆటంకము కలిగించునని ఎరుగవలెను. ఇవి అంత్యదినములు అని విశ్వాసులందరికి తెలుసు. అంత్యదినములలో అపాయకరమైన సంగతులు సంభవించును. మనుష్యులు స్వార్థప్రియులు ధనాపేక్షులు, బింకములాడు వారు. అహంకారులు, దూషకులు తలిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞతలేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగల వారివలె ఉండియు దానిశక్తిని ఆశ్రయించని వారునైయుందురు. ఇట్టివారికి విముఖుడవై యుండుము. 2తిమోతి 3:2-5.

ఇటువంటి సంగతులు ఇప్పటికాలంలో అక్షరాల జరుగుతున్నవి. కనుక వీటి నుండి తప్పించుకొనుటయే. వీటిని జయించుటకును ప్రార్ధనలు ఎంతో అవసరము. మరి ముఖ్యముగా కుటుంబ ప్రార్ధనలు ఎంతో అవసరమని గ్రహించవలెను. చాలామంది కుటుంబ ప్రార్ధనలు మాకు వీలుకాదండి . మేము ఉదయం లేస్తే తలా ఒక దిక్కుకు వెళ్ళిపోతాము. మరల ఎప్పుడో వేరు వేరు సమయాల్లో గూటికి చేరుకుంటాము. మాకు కుదరదండీ అంటారు. మనసు వుంటే మార్గం ఉంటుంది. ఉదాహరణ ఆధార్‌కార్డ్ రాయించుకోవడానికి కుటుంబం అంత వీలు చేసుకొని వెళతారు. అంతకంటే గొప్పదైన మనకందరికి రక్షణకు ఆధారమైన యేసు సన్నిధి ఏర్పాటు చేసుకొనుటకు అందరూ త్వరపడవలెనని మనవి. ఈ అపాయకరమైన దినములలో యేసు తోడు లేకుండా మనము సమాధానంగా జీవించలేము. దయచేసి ప్రార్ధించండి. ఫోన్ చేయవలసిన నంబర్లు - 9704255416, 9676340371, 08592-231281.

**-ఎడిటర్**

సీరియల్

# అపొస్తలుడు

9

– కొడవటికంటి

ఆ మాటకు హేలేదు ఏమి మాట్లాడకుండా సౌలు చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకొని వెళ్ళాడు. యూదుల గృహాలవలె వెలుతురు తక్కువగా వున్న లోగిలి. కొంచెం అలవాటు అయితేనే, బయట నుండి లోపలికి వచ్చిన వారికి లోపల ఉన్న మనుష్యులు వస్తువులు కనిపిస్తాయి.

సౌలు ఓ ఆసనం మీద కూర్చున్నాడు. హేలేదు లోపల గదిలోకి వెళ్ళాడు. యోసేపు తన చిన్ననాటి స్నేహితుడు. పదమూడు సంవత్సరాల వయసులో యెరూషలేము వచ్చిన కొద్దిరోజులకే అతనితో పరిచయమయ్యింది. గ్రీకు భాష అనర్గళంగా మాట్లాడుతున్న యోసేపును చూసి తను ఆశ్చర్యపోయాడు. తన ఉపాధ్యాయుడు ఒక్కడు మాత్రమే గ్రీకు భాష కొంచెం కొంచెం మాట్లాడగలడు. కాని తనలాగే గ్రీకు భాష మాట్లాడే ఇంకొక వ్యక్తిని చూసి ఆ రోజు నుంచే ఒకటైపోయారు.

యోసేపు అక్క మరియమ్మ చాలా భక్తిగలది. తన అక్క అంత భక్తిగలదిగా ఉండదు. పైగా కొంచెం గర్వంగా ఉంటుంది. మరియమ్మ కొంచెమైనా దంబముగా ఉండదు. అందువల్ల తను ఆ ఇంట్లోని వాడయ్యాడు.

చదువులో కూడ తనతో పోటిపడేవాడు యోసేపు. అయిదు సంవత్సరాల క్రితం తను తార్సు వెళ్ళేటప్పటికే అతను మహాసభ సభ్యుడైనాడు. తనలాగే ఎన్నడు పదవీ వ్యామోహం లేదు. తలచుకున్న పని తుదముట్టించేలా ఆసక్తి అతనిలో లేదు. వాళ్ళ ఇంట్లో ఎప్పుడూ ఏదో మతపరమైన చర్చ జరుగుతూ ఉంటుంది. కుప్రలో ఉన్న మాగాణి పొలాలు చాలా సారవంతమైనవి. అందువల్ల వాటికి చాలా గిరాకి ఉంది. యోసేపు పంటకాల్‌లో కుప్రలోనే ఉండేవాడు.

హేలేదు గిన్నె నిండా ద్రాక్షారసం తెచ్చిచ్చాడు. ఎప్పుడూ ఈ ఇల్లు ఇలా నిశ్శబ్దంగా చూడలేదు.

"అక్కగారు లేరా?" అడిగాడు సౌలు.

"యెరూషలేములోనే ఉన్నారు" చెప్పాడు హేలేదు.

"ఎక్కడ? దేవాలయములోనా? నేను ఇప్పుడు దేవాలయం నుండే వస్తున్నాను. స్త్రీ విభాగంలో ఎవరూ లేరే. మరి ఎప్పుడు ఇంటికి వస్తారు? యోసేపు భార్య ఇక్కడే ఉందా?" అని అడిగాడు సౌలు.

హేలేదు కొంచెం ఆలోచిస్తూ "ఇక ఈ రోజు ఎవరూ ఇంటికి రారు, ఆలయంలోనే వుంటారు" అన్నాడు.

సౌలుకి ఏమీ అర్థంకాలేదు. ఇక్కడంతా తనకు సొంత ఇల్లు. తన సొంత మనుష్యులు. అయితే ఈ రోజు ఇదే మొదటిసారి ఈ ఇంటిని చూసినట్లుగా అనిపిస్తుంది. ఇల్లంతా కలయచూశాడు. అసలు ఇది ఇల్లేనా? ఎప్పుడూ నౌకర్లతో డాబుగా, దర్జాగా ఎంతమంది వచ్చినా ఇంకా ఇంకా విశాలంగా అనిపించే ఈ ఇల్లు, ఈనాడు ఈ విధంగా దిబూసిగా అయిపోయింది. చాలాకాలంగా ఈ ఇంట్లో మనుష్యులు లేనట్లు ఏదో ఆత్మ ఆవరించుకున్నంత నిశ్శబ్దంగా వుంది. బయట తోట పచ్చగా ఉంది. అంటే హేలేదు చాలా కష్టపడి పనిచేస్తున్నట్లు.

"వీరంతా ఎక్కడకు వెళ్ళారు?" అడిగాడు సౌలు.

"వాళ్ళు ఎక్కడకు వెళ్ళలేదయ్యా, వాళ్ళంతా అక్కడే ఉంటారు. ఎప్పుడైనా ఇక్కడకు వచ్చి కొంచెంసేపు పని చూసుకొని పోతుంటారు" అన్నాడతను. ఏదో మామూలు విషయం, చాలాకాలం క్రితమే పాతబడి పోయిన ఓ క్రొత్త విషయంలాగా.

"ఇప్పుడు వాళ్ళంతా ఎక్కడ ఉంటారు?" అడిగాడు సౌలు.

"దేవాలయపు ప్రాంగణంలో కానీ, దారిప్రక్కన ఉన్న సత్రంలో కానీ ఉంటారు. అక్కడే అందరికీ భోజనం తయారు చేస్తుంటారు. మరలా రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత ఆరాధన, రొట్టెవిరుపు అయిన తర్వాత పండుకోవడానికి ఇక్కడికి వస్తారు" అని చెప్పాడు.

సౌలుకు అర్థం కాలేదు. "హేలేదు కొంచెం విడమరచి

చెప్పు. ఏమిటి ఇదంతా?" అడిగాడు.

హేలేదు తను చేస్తున్న పని ఆపి, సౌలు ఎదురుగా కూర్చుని "పస్కా పండుగ అయిన తర్వాత ఏడు వారాలకు పెంతుకోస్తు పండుగ వస్తుంది కదా! సరిగ్గా ఇప్పటికి సంవత్సరం క్రితం, విశ్వసించిన వారందరూ కూడి ప్రార్థన చేస్తుండగా, పరిశుద్ధాత్మ ఇక్కడ ప్రార్థన చేస్తున్న వాళ్ళమీద, నజరేయుడైన యేసు వాగ్దానం చేసిన విధంగా దిగి వచ్చాడు" అని చెప్పాడు.

"ఈ నజరేయుడైన యేసు ఎవరు?" అని అడిగాడు సౌలు.

అప్పుడు కాని హేలేదుకు అర్థంకాలేదు. సౌలుకు విషయాలేమి తెలియవని. పూర్తిగా మొదటి నుండి చెప్తే కానీ అర్థం కాదని.

"నజరేయుడైన యేసు అనగా మెస్సయ్య. ఈ లోకానికి రావలసియున్న దేవుని కుమారుడు. ఈయనను గూర్చి యోహానుగారు మరణించక ముందు సాక్ష్యమిస్తూ ఉండేవారు" అని చెప్పాడు హేలేదు.

"ఈ యేసు మెస్సయ్య అని ఎవరు చెప్పారు? ఇప్పుడు ఆయన ఎక్కడ ఉంటున్నారు? ఆయనను గూర్చి తార్సు పట్టణంలో కూడ, గ్రీకు దేశము నుండి యెరూషలేము పండుగను ఆచరించటానికి వచ్చిన అనేకుల వలన విన్నాను. అయితే ఆయనను గూర్చి ప్రవక్త అని, లేక చనిపోయిన ఒక ప్రవక్త అని చెప్పారు. కొంతమంది హేరోదు తలగొట్టించిన యోహాను మృతులలో నుండి లేచినట్లు చెప్పారు. ఇప్పుడు ఆయన ఏ ప్రాంతంలో బస చేస్తున్నాడు?" అని అడిగాడు సోలు.

"ఇప్పుడు ఆయన మరణము గెలిచి, లేచి ఆరోహణమై, దేవుని కుడి పార్శ్వమున కూర్చొనియున్నాడు" అని చెప్పాడు. అతని మాటలలో నిశ్చయత చూస్తే హేలేదు స్వయంగా చూసిన వాడిలా మాట్లాడుతున్నాడు.

"ఆయన మరణించాడా? ఎప్పుడు? ఎలాగ?" అడిగాడు సౌలు ఏదో నిరాశగా జరగకూడనిది జరిగినట్లుగా.

"మన ప్రధానయాజకులు, పెద్దలు ఆయన సిలువ మరణానికి అర్హుడని పిలాతు మీద ఒత్తిడి తీసుకొని వచ్చారు" అని చెప్పాడు హేలేదు.

సౌలు ఒక్కసారిగా కుప్పకూలినంతగా నిరాశగా చూసి "సి...లు...వా?" అని నీరసంగా అన్నాడు.

"యేసు శిష్యులు ఉన్నారు. వీరిలో కొందరు యాజకులు కూడా ఉన్నారు. వీరందరు మీరు ఆలోచించినట్లుగా ఒకప్పుడు ఆలోచించినవారే. ఈనాడు వీరందరు నజరేయుడైన యేసు నామముననే రక్షణ పొందవలెనుగాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ వీలుకాదని, మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుతున్నారు" అని హేలేదు ముగించాడు.

సౌలు కోపంగా లేచి నిలబడి వణికిపోయాడు. "మ్రాను మీద వ్రేలాడినవాడు శాపగ్రస్తుడు, క్రీస్తు (అభిషిక్తుడు) అని అనవద్దు. క్రీస్తు (రక్షకుడు) అని అనవద్దు..." అని అరిచాడు.

హేలేదు వీధివైపుగా ఉన్న కిటికీ తలుపులు తెరచి, వీధివైపుగా చూస్తున్నాడు.

"అదిగో బర్నబాగారు" అని అరిచాడు హేలేదు.

సౌలు ఆలోచిస్తూ మరోవైపు చూస్తున్నాడు. అతని ముఖం మారిపోయింది. కళావిహీనమై పోయింది.

హేలేదు దగ్గరగా వచ్చి సౌలు భుజంమీద చెయ్యివేసి "బర్నబాగారు వస్తున్నారు" అన్నాడు.

"ఇప్పుడు మీ స్నేహితుడు యోసేపుగారి పేరు 'బర్నబా'. ఆయన శిష్యులందరిని హెచ్చరిస్తూ ఉంటాడు కాబట్టి ఆయనకు హెచ్చరిక పుత్రుడు అని అర్థం వచ్చే విధంగా బర్నబా అని పిలుస్తుంటారు" అంటుంటే సౌలు గబగబా ఆ కిటికీవైపుగా వెళ్ళి కూర్చున్నాడు.

హేలేదు చూసి "ఎక్కడా?" అని అరిచాడు.

హేలేదు కిటికీ వద్దకు వచ్చి కిటికీ బయటకు చెయ్యిచాపి క్రింద వీధిలో నడచివస్తున్న ముగ్గురు వ్యక్తులను చూపించాడు. వారందరూ యూదులే. తలల మీద పాగాలు ఉన్నాయి. మధ్యలో ఎత్తుగా, ఎర్రగా, అందంగా ఉన్న బర్నబాని చూసి సౌలు ఆశ్చర్యపోయాడు.

"ఇదేమిటి యోసే ఇలా ఉన్నాడు?" అని తనలో తాను అనుకున్నట్లుగా పైకి అనేశాడు.

"యేసునందు విశ్వాసులైన శిష్యులందరు అలాగే ఉంటారు" అన్నాడు హేలేదు.

కొంచెంసేపట్లో మెట్లు ఎక్కివచ్చిన బర్నబా సౌలును చూసి ఆశ్చర్యంగా నిలబడిపోయాడు.

క్షణంసేపు సౌలు ప్రపంచాన్ని మరచిపోయి బర్నబాని గట్టిగా కౌగిలించుకున్నాడు. అలాగే కొంచెంసేపు ఏమి మాట్లాడుకోవాలో ఇద్దరికీ అర్థంకాలేదు.

''బర్నబా'' అని నవ్వుతూ సౌలు ఆసనములో కూలబడిపోయాడు. హృదయం తేలికగా ఉంది.

బర్నబా కూడా ఎదురుగా కూర్చుని, తన ప్రక్కన దచి వచ్చిన ఇద్దరు యువకులను చూపిస్తూ, ''స్తెఫన్, నికోలాయిస్" అని తార్సువాడైన సౌలు అని పరిచయం చేశాడు. సౌలు అనే పేరు వినగానే స్తెఫన్ "సౌలు అంటే మీరేనా?" అని అప్యాయంగా "మీ గురించి బర్నబాగారు చాలాసార్లు చెబుతుంటాడు" అన్నాడు.

స్తెఫన్ మాట విని "మీరు యెరూషలేము వచ్చి ఎంతకాలం అయింది?" అని గ్రీకు భాషలో అడిగాడు. సౌలు స్వచ్ఛమైన గ్రీకు భాష మాట్లాడిన ధోరణి చూసి స్తెఫన్, నికోలాయిస్‌లు అవాక్కయిపోయారు. ఈయనతో ఎంతసేపైనా మాట్లాడవచ్చును అనుకున్నారు.

"మీరు పేతురుగారిని కలిసి ఇంతవరకు మనం మాట్లాడిన కొన్ని విషయాలు చెప్పడి. నేను కొంచెం ఆలస్యంగా వస్తాను" అని బర్నబా అంటుంటే వాళ్ళు క్రిందకు దిగి వెళ్ళిపోయారు.

సౌలు కొంచెంసేపు బర్నబా కళ్ళలోకి చూసి "యేసు ఎవరు?" అని అడిగాడు.

"ఆయన ఎవరో తెలుసుకోవడానికి నాకు పూర్తిగా రెండేళ్ళు పట్టింది. కొంతకాలం గడిస్తే నీకు కూడా అర్థమవుతుంది" అనాడు.

"నీవు చెప్పరాదా" అని సౌలు అడిగాడు.

"ఆయనను ఎవరికి వారే తెలుసుకోవాలి కాని, ఒకరు చెప్తే అర్థం కాదు. ఆయన అందరికి చేరువలోనే ఉంటాడు" అని చెప్పాడు.

'ఆయన చేరువలో ఉంటే ఇలాగ బీదవాళ్ళయి పోతారా? అంటూ బర్నబా పైవస్త్రాన్ని వ్రేలు పెట్టి చూపించాడు సౌలు.

"అదేమి కాదు. ఖరీదైన వస్త్రం ఇచ్చు వర్ఛస్సు కంటే, యేసుతో సహవాసం ముఖానికి ఎక్కువ వర్ఛస్సునిస్తుంది" అన్నాడు బర్నబా.

"కొంచెం చెప్పు" అడిగాడు సౌలు.

"నజరేయుడైన యేసు యూదయదేశంలో, దావీదు పట్టణంలో ప్రజాసంఖ్య కాలంలో, పరిశుద్ధాత్మ వలన కన్యకకు జన్మించాడు. నజరేతులో పెరిగి ముప్పై ఏండ్ల వయస్సులో యోహానుచే బాప్తిస్మము తీసికొని పాలస్తీనా దేశమంతటా అనేక సూచక క్రియలు, అద్భుతములు చేసి మానవులందరి పాపముల కొరకు పస్కా పశువుగా సిలువ మరణము పొంది, మూడవ దినమున మరణమును జయించి, పునరుత్థానుడై లేచి, నలభై రోజులు ఆయన శిష్యులకు, అనేకులకు కనిపిస్తూ సంచరించి, దాదాపు అయిదు వందలమంది శిష్యులు చూస్తుండగా పరలోకమునకు ఆరోహణమైనాడు.

ఆయన త్వరలో తిరిగి వస్తాడని తన శిష్యులను తనతో పరలోకమునకు తీసుకొని వెళ్తాడని చెప్పియున్నాడు. అందువలన ఆయన శిష్యులు అందరూ దివారాత్రములు దేవాలయములో కూడుకుంటూ ప్రార్థనలతో సమయం గడుపుతుంటారు" చెప్పాడు బర్నబా.

"అయితే ఈయన క్రీస్తు కాదా?" అన్నాడు సౌలు.

"యేసే క్రీస్తు" అన్నాడు బర్నబా.

''యేసే క్రీస్తు అయితే ఈ రోమీయులు ఇంకా యెరూషలేము యూదయ మీద పరిపాలన చేస్తున్నారుగా" అన్నాడు ఉద్వేగంగా సౌలు.

బర్నబా ఆలోచిస్తున్నాడు.

ఆ ప్రశ్నకు జవాబు తనకు తెలుసు. కాని సౌలుకు అర్థమయ్యే విధంగా చెప్పటానికి ఇది సమయమా? అర్థం చేసుకోవాలనే ఆలోచన అసలు సౌలులో ఉందా? అను కుంటూ.... **(సశేషం)**

సీరియల్

# సూరత్‌లోని కాఫీ హోటల్ 9

## (లియో టాల్‌స్టాయ్)

**ఇండియాలో సూరత్ పట్టణంలో ఓ కాఫీ హోటల్ ఉంది.** అక్కడికి ప్రపంచ నలుమూలల నుండి యాత్రికులు, విదేశస్తులు ఎప్పుడూ వస్తుంటారు.

ఒకరోజు పండితుడైన పర్షియా దేశస్తుడు ఈ హోటల్‌కు వచ్చాడు. అతను దైవత్వము యొక్క గొప్పతనము గురించి ఎక్కువగా చదివేవాడు. ఎక్కువ పుస్తకాలు వ్రాశాడు. ప్రసంగాలు చేశాడు. చివరికి అతని మెదడు వక్రీభవించి అసలు దేవుడే లేడనే స్థితికి వచ్చాడు. ఈ సంగతులు తెలుసుకున్న ఆ దేశపూజారులు అతనికి దేశ బహిష్కరణ విధించారు. అతను అలా ఆలోచించి ఆలోచించి అసలు ఈ ప్రపంచమును పరిపాలించే 'శక్తి' లేదని చెప్పడం మొదలుపెట్టాడు.

అతనికి ఒక ఆఫ్రికా బానిస ఉన్నాడు. ఈ వేదాంతి ఏ ఊరు వెళ్తే అక్కడికి వెళ్తుంటాడు. ఈ వేదాంతి సూరత్‌లో కాఫీ హోటల్‌కు వచ్చి అక్కడ ఓ 'దివాన్' మీద కూర్చున్నాడు. ఈ చోటుకు బయట తలుపు దగ్గర ఓ బండరాయి మీద సూర్యరశ్మి తగిలేచోట కూర్చుని ఈగలను తోలుకుంటు న్నాడు ఈ బానిస.

వేదాంతి "ఓపియమ్"ను హోటల్‌లో కొని త్రాగాడు. అప్పుడు ఆ ఓపియమ్ అతని మెదడుమీద పనిచెయ్యసాగింది. అతను కూర్చున్న చోటనుండే "ఒరే బానిసవాడా! దేవును ఉన్నాడని నీవు నమ్ముతున్నావా?" అని అడిగాడు.

ఆ బానిస "తప్పకుండా దేవుడు ఉన్నాడయ్యా!" అని తన కోటు లోపల జేబులో నుండి చిన్న చెక్కబొమ్మ బయటకు తీసి ''మా దేశములో అందరు 'సకీషా' చెట్టును పూజిస్తుంటారు. ఆ చెట్టు కొమ్మతో చెయ్యబడిన విగ్రహాలను పూజిస్తుంటారు. నేను పుట్టినప్పటినుండి నన్ను కాపాడు తున్నది ఈ దేవుడే" అన్నాడు. అక్కడ కూర్చున్న వారంతా ఆ బానిస మాటలు విన్నారు.

అక్కడ ఉన్న ఓ బ్రాహ్మణుడు ఈ మాటలు విని "ఒరే పిచ్చివాడా! దేవుడ్ని నీ చొక్కాలో జేబులో దాచుకోగలవు అనుకుంటున్నావా? బ్రహ్మ అనే ఏకైక దేవుడు ఉన్నాడు. ఈ విశ్వమంతటి కన్నా పైనుండు ఆ బ్రహ్మ ఈ సృష్టిని చేశాడు. అందుకని ఆయన దేవాలయమును గంగానది ఒడ్డున కట్టాము. గొప్ప పూజారులు ఆయనను పూజిస్తుంటారు" అన్నాడు.

అక్కడున్న ఓ యూదుడు ఈ మాటవిని "కొండలలో వున్న గుడి ఆయనదికాదు. అసలు – దేవుడు బ్రాహ్మణులను కాపాడడు. ఆ గుడికిరాడు. దేవుడు అనాదిగా యూదాప్రజలను ఏర్పరచుకొని వారిని మాత్రమే కాపాడు తున్నాడు. ఆయనకు ఆలయము లేదు. ఇశ్రాయేలీయులు ప్రపంచమంతా చెదరివున్నారు. వారందరిని ఆయన ఒక చోట చేర్చి యెరూషలేములో యూదా రాజ్యము స్థాపించి ప్రపంచాన్నంతా పరిపాలన చేస్తాడు" అన్నాడు. అలా చెప్పి అతను కండ్లవెంబడి నీరు పెట్టుకొని ఏదో మాట్లాడబోయాడు కాని, ఓ ఇటలీ వ్యక్తి కల్పించుకొని "నీవు చెప్పేది యదార్థము కాదు. దేవుడు పక్షపాతి అని చెబుతున్నావు. ప్రపంచములోని మానవులందరు దేవునికి ఒక్కటే. పూర్వపు సంగతులు ఏమోగాని, యూదులు ఆయనకు కోపం తెప్పించారు. అందువలన వారు ప్రపంచమంతా చెదరగొట్టబడ్డారు. ఇప్పుడైతే ఎవరైతే రోములో వున్న క్యాథలిక్ సంఘమును హత్తుకుంటారో వారినే ఆయన రక్షిస్తాడు" అన్నాడు.

ఈ మాటలు విన్న అక్కడున్న ఓ ప్రొటస్టాంట్ పాస్టరు ఆశ్చర్యపోయి "రక్షణ క్యాథలిక్కులకేనా? అలా ఎన్నటికి

జరుగదు. క్రొత్త నిబంధనలో తెల్పినది మాత్రమే జరుగుతుంది – అది యేసుక్రీస్తును విశ్వసించుటే!" అన్నాడు.

సూరత్‌లో నివశించే ఓ టర్కీ దేశస్తుడు కస్టమర్స్ హౌస్‌లో పనిచేస్తుంటాడు. అతను పైప్‌తో పొగ త్రాగుతూ "మీరు చెప్పేదంతా అబద్ధము. ఇప్పటికి పన్నెండు వందల సంవత్సరములకు పూర్వము మహమ్మద్ ప్రవక్త వచ్చాడు. ఆయన మహాఘనుడు. మహమ్మదీయులు ప్రపంచమంతా ఈ పన్నెండు వందల సంవత్సరాలలో ఎలా వ్యాప్తి చెందారో మీరు ఎరుగుదురా? అదీకూడా ఒమర్ అనుచరులు మాత్రమే ఆయన ప్రేమకు పాత్రులు గాని, అల్‌ని వెంబడించే వారు మాత్రం దీవెన పొందరు" అన్నాడు.

అల్ వర్గం వాడైన పర్షియన్ వేదాంతి జవాబు ఇవ్వాలను కున్నాడు. కాని అప్పటికే ఆ కాఫీ హౌస్‌లో గొప్ప తర్జన భర్జనలు ఆకాశాన్నంటాయి. అక్కడున్న అభిషేకించు క్రైస్తవులు అంతా టిబెట్‌వారు. ఇష్మాయేలీయులలో నిప్పును పూజించేవారు ఉన్నారు. వీరంతా దేవుని గుణగణములు వాదించుకుంటున్నారు. ప్రతి ఒక్కడు వాని దేశమతమే యదార్థమని వాదిస్తున్నారు. అందరు అరుస్తున్నారు. అయితే చైనా అతనుమాత్రం కన్‌ఫ్యూజన్ మతస్తుడు. ఒకమూల కూర్చుని ఈ గొడవలో తలదూర్చలేదు. టీ త్రాగుతూ అందరి మాటలు వింటున్నాడు.

టర్కీ అతను చైనావాని దగ్గరకు వచ్చి "నా మాటలు వింటారా? అదేమంటే మీ దేశస్తులు నా దగ్గరకు వస్తుంటారు. మీ దేశములోకి ఎన్నోమతాలు ప్రవేశిస్తుంటాయి. కానీ మీరు మాత్రం మహమ్మద్ ఒక్కడే యధార్థమని నమ్ముతారు. మీ నమ్మకాన్ని వీరందరికి చెప్పండి" అన్నాడు.

అప్పుడు అందరూ "మీరు చెప్పండి! మీ అభిప్రాయము మేము వింటాము" అన్నారు.

అప్పుడు ఆ కన్‌ఫ్యూజన్ మతస్థుడైన ఆ చైనా అతడు కొంచెంసేపు కండ్లు మూసుకొని ఆలోచించి తన రెండు చేతులు అంగీలోనుండి బయటకు లాగి చేతులు పైదాక మడచి "మనందరిలో ఉన్న గర్వమే అవతల వాళ్ళను అర్థం చేసుకోవడానికి అడ్డువస్తోంది. ఆ గర్వాన్ని ప్రక్కన పెడితే నేను ఓ చిన్నకథ చెబుతాను నిశ్శబ్దంగా వినండి" అన్నాడు.

"నేను ఇక్కడికి ప్రపంచమంతా తిరిగే ఓ ఇంగ్లీషు వారి ఓడలో వచ్చాను. మేము అలా వచ్చేటప్పుడు 'సుమిత్రా' ద్వీపములో మంచినీటి కొరకు ఓడ దిగాము. అలా దిగినవారిలో అన్ని దేశాలకు చెందినవారున్నారు. అక్కడ చిన్న గ్రామానికి దగ్గరలో ఉన్న కొబ్బరిచెట్ల నీడలో కూర్చున్నాము. అప్పుడు అక్కడికి ఓ గ్రుడ్డివాడు వచ్చాడు. సూర్యుని గురించి తెలుసుకొని ఎక్కువ కాంతి తను పొందాలని సూర్యునివైపు అతను చాలాసేపు చూసినందున అతను గ్రుడ్డివాడయ్యాడని మాకు తెలిసింది.

తర్వాత తనలో తను మాట్లాడుకొనినట్లుగా "సూర్యుని కాంతి ద్రవము కాదు. ఆ కాంతే కాని ద్రవమైతే ఒకదాంట్లో నుండి ఒక దాంట్లోకి పోసుకోవచ్చును. ఆ కాంతి ఒక దివిటికాదు. అలాగైతే అది ఆరిపోతుంది. ఆ కాంతి ఒక శక్తికాదు. అలా అయితే దాని కదిలించగలము. సూర్యకాంతి ద్రవముకాదు, నిప్పుకాదు, ఆత్మకాదు, పదార్థము కాదు" అన్నాడు. ఈ గ్రుడ్డివాడు అతను ఎల్లప్పుడు సూర్యకాంతి గురించి ఆలోచించి ఆలోచించి అతని రెండు కండ్లు పోగొట్టుకున్నాడు. అతను పూర్తిగా గుడ్డివాడైన తర్వాత అసలు సూర్యుడేలేడు అని అంటున్నాడు.

ఇంతలో ఆఫ్రికా బానిస తన యజమానిని ఒక చెట్టు నీడలో కూర్చుండబెట్టి ఓ ఎండిన టెంకాయ పట్టుకొని దాన్ని వలిచి, పిండి, నూనె తీసి ఒత్తిని దానిలో నానవేశాడు. రాత్రికి దాన్ని ముట్టించి వెలుగు తెప్పించాలని.

అప్పుడు గ్రుడ్డివాడు అతని దగ్గరకు వచ్చి "ఏమండి! నేను సూర్యుడే లేడంటే నమ్మరెందుకు? ఇప్పుడు చీకటి వచ్చింది చూడండి" అన్నాడు.

"సూర్యుడి విషయం నేను ఆలోచించను. ఇప్పుడు మనకు వెలుతురు కావాలి. దానికోసం నేను ప్రయత్నిస్తున్నాను" అని ఓ టెంకాయ చిప్ప పట్టుకొని "సూర్యుడు అంటే ఇదే" అన్నాడు.

వారికి చేరువలో కూర్చున్న ఓ కుంటివ్యక్తి వీరి మాటలు విని నవ్వాడు. "నీవు పూర్తిగా గ్రుడ్డివాడయ్యావు కనుక నీకు సూర్యుడు తెలియదు. సూర్యుడు ప్రతిరోజు సముద్రమునుండి పైకిలేస్తాడు. సాయంకాలం ఆ కొండలోకి దిగిపోతాడు. మేము రోజు చూస్తుంటాము" అన్నాడు.

అక్కడే కూర్చుని ఉన్న ఓ జాలరి ఈ మాటలు విని "నేను రోజంతా ఇక్కడే కూర్చుంటాను. నీకు కాళ్ళులేవు. నేను రోజు సముద్రంలో వేటకి వెళ్తాను. రోజు సూర్యుడు సముద్రంలో నుండి లేచి మళ్ళీ సముద్రంలోకి వెళ్ళిపోతాడు. ఈ కొండలలోకి వెళ్ళడు" అన్నాడు.

అంతలో మరో ఇండియా నుండి వచ్చి యాత్రికుడు వారి మాటలు విని "మీవి వెర్రిమాటలు. మండుచున్న సూర్యుడే ఒక అగ్నిగోళము. నీళ్ళలో దిగితే ఆరిపోడా? సూర్యుడు ఒక అగ్నిగోళము కాదు. ఆయన దేవా అనబడే ఒక దేవుడు. ఆయన రథం ఎక్కి 'మేరు' పర్వతాలలో ప్రయాణం చేస్తుంటాడు. కొన్నిసార్లు దుష్ట దేవతలైన రాక్షసులు రాహు, కేతువు ఆయనను మ్రింగివేస్తారు. అప్పుడు భూమిఅంతా చీకటి అవుతుంది. కాని మా పూజారులు ప్రార్థన చేసి ఆ 'దేవా'ని విడిపిస్తారు" అన్నాడు.

అప్పుడు ఈజిప్టు దేశ యజమాని ఇదంతా విని "నేను ఈ ప్రపంచమంతా తిరిగాను. ప్రతిచోట సూర్యుడు ఉన్నాడు. అలాంటప్పుడు నీవు మీదేశంలో 'మేరు' పర్వతాలలోనే సూర్యుడు తిరుగుతాడని ఎలా చెబుతావు? ప్రపంచమంటే ఇండియా ఒక్కటేకాదు. సూర్యుడు జపాన్ దేశంలో లేస్తాడు. అందువల్ల జపాన్‌వారు 'నిప్పోను' అని పిలుస్తారు. ఆయన అక్కడలేచి చాలాదూరం ప్రయాణం చేసి ఇంగ్లాండు అవతల దిగుతాడు. నాకు మా తాత చెప్పాడు ఆయన గొప్ప నావికుడు" అన్నాడు.

అప్పుడు ఇంగ్లీషు వాడైన ఒకడు "అలా అనవద్దు, మా దేశంలో సూర్యుడు దిగడు. ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళండి. అక్కడ మీరు సూర్యుని చూస్తారు. ఆయన ఎప్పుడు ప్రయాణం చేస్తుంటాడు" అని ఒక కర్ర తీసుకొని సూర్యుని ప్రయాణం ఇసుకలో గీయసాగాడు.

మరొకరు కలుగజేసుకొని "ఈయనకు చాలా తెలుసును కాని వివరించి చెప్పలేకపోతున్నాడు" అన్నాడు.

ఇప్పుడు అక్కడున్న ఓడ ముఖ్య నావికునితో "మీరేమి చెప్తారు?" అని అందరు ఆయన వైపు తిరిగారు.

"మీరందరు మోసగించబడ్డారు. ఇతరులను మోసం చేస్తున్నారు. సూర్యుడు ఎక్కడికి కదలడు. మనమున్న భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతోంది. సూర్యుడు ఏదో ఒక దేశంకోసమో ఓ కొండకోసమో ఓ సముద్రము కోసమో తన కాంతినివ్వడు. ప్రపంచమంతా ఆయన కాంతి ఉన్నది. మీరు మీ కాళ్ళక్రింద వున్న భూమిని చూస్తూ ఉన్నారు. పైనున్న ఆకాశాన్ని చూడండి. మీకు అంతా అర్థమవుతుంది" అన్నాడు అని చెప్పాడు.

చైనా వ్యక్తి "ఇదంతా మనలో ఉన్న గర్వం, అహం. మనల్ని బుద్ధిహీనులుగా చేసింది. విశ్వమంతటి కొరకు దేవుడు చేసిన సూర్యుడు మన దేశం కోసమే మన మతం కోసమే మనం పూజించుకుంటున్నాము. సూర్యుని వలన భూమికేకాదు విశ్వంలో ఇంకా కొన్ని గ్రహాలకు కూడా కాంతినిచ్చే విధంగా దేవుడు చేశాడు" అన్నాడు.

"దేవుడెక్కడైనా సొంతంగా ఒక దేవాలయం నిర్మించి ప్రపంచ మంతా ఇలా దేవాలయములో కట్టాలని చెప్పాడా? భూమిమీద మానవులు నిర్మించిన దేవాలయాల్లో విగ్రహాలు ఉంటాయి, ఏవేవో వస్తువులుంటాయి. ఆకాశ పక్షులుకాని, సముద్రాలు గాని ఉన్నవా? బలులు అర్పిస్తాయా?

దేవుని విషయంలో మానవ మనస్సు ఎంత ఉన్నతముగా ఉంటుందో దేవునికి అంత చేరువలో ఉంటాడు. ఆయనను ఎంత అర్థం చేసుకుంటామో ఆయన అంతబాగా అర్థమవుతాడు. అప్పుడు ఆయన మంచితనము, ఆయన దయ, ఆయన ప్రేమను పొందుతాము, అనుభవిస్తాము" అన్నాడు. అప్పటికే ఎవరూ ఏమీ మాట్లాడలేదు. చైనా ఆయన మాటలలోని అంతరార్థం గ్రహించడానికి ప్రయత్నిస్తున్నారు.

**(సశేషం)**

# క్రైస్తవులు భయపడతగునా? 8

ఎప్పుడైనా ప్రభుత్వాలు ఈ విధమైన ముద్రను ధరించాలని చట్టం చేసినపుడు ప్రజలు ముఖ్యంగా విశ్వాసులు దాని అంగీకరించకూడదు. ఎందుకంటే రక్షణ కోల్పోతారు. మరియు ఏ విధమైన కృపకు పాత్రులు కారు. కనుక హెచ్చరింపబడాలి. పరలోకాన్ని లేదా నరకాన్ని ఎన్నుకొన అవకాశం ఇది.

మనము నివశించునది సరియైన సమయము. నెఫీలీయులు తిరిగి వస్తారని యేసు చెప్పినట్లు వారు వచ్చారు. ఎవరైతె యేసు ద్వారా దొరికే రక్షణ వస్త్రాన్ని ధరించుకుంటారో వారికి ఈ దుష్ట జీవుల నుండి రక్షణ ఉంటుంది. ఎవరైతే వాటి ఆశలకు లోబడతారో వారికి ఉండదు. తన రక్షణను సందిగ్ధంలో పడవేసే అటువంటి ముద్రను ఎవరు తీసుకోరుగా అని నీవు ప్రశ్నించవచ్చు. ఇది మోసపూరితమైనది. ఈ ముద్రను ఆశించే విధంగా ప్రాధమికంగా పావులు కదుపుతున్నది వాటికన్ అని నేను వివరించాను.

నీవు మానవస్థితి కంటె అధికమైన స్థితిలోకి వెళ్ళాలంటె ఈ జన్యుపరమైన మార్పు ఖచ్చితంగా స్వీకరించాలని సాతాను కుతంత్రపు గ్రహాంతర రక్షకుడు వెల్లడిస్తాడు. పైన పేర్కొన్నట్లు నేను చెప్పిన క్యారట్ (తాయిలం) ఇదే. ఈ ముద్ర పొందకపోతే నీవు మరణిస్తావు అనేది చక్కెరపాకం లాంటిది. దీని పొందకపోతే గొప్ప ప్రమాదంలో పడతారు అని ఆ గ్రహాంతర రక్షకుడు మోసపరుస్తాడు. మన భూమి ఉనికే ప్రమాదంలో ఉందని ఈ భూస్థితి నుండి మరొక వాతావరణ స్థితిలోకి మార్చబడవలసిన అవసరం ఉందని హెచ్చరిస్తాడు. ఆ ప్రమాదం తప్పించడానికి ఈ భూమిపై దీని పొందని వారిని తీసివేయవలసి ఉంటుందని చెప్తాడు.

ఆ విధంగా భూ మండలాన్ని భయోత్పాతంలోనికి వణుకులోనికి నెట్టి రక్షించండి అని మొరపెట్టేటట్లు చేస్తాడు. ఎంత ఘోరమోసము! ఎవరైతే ముద్ర పొందరో వారిని ఏరి వేయడానికే గ్రహాంతర జీవులు ఎదురు చూస్తుంటాయని వెల్లడిస్తాడు. మరో శ్రమల కాలంలో నుండి తప్పించబడి ఎత్తబడే సంఘానికి వారు ఈవిధంగా తమ అనుకూల నిర్వచనమని ఇస్తుంటారు.

యేసు మానవాతాకారం నుండి ఆయన ప్రణాళిక లన్నిటిని అపవాది ఎదుర్కోవాలని చూస్తుంటాడు. ఏ విధంగా పరిశుద్ధాత్మ ఆవరింపు ద్వారా మరియ – ఇమ్మానుయేలును అనగా దేవుని కుమారుని గర్భము ధరించిందో, అలాగే అపవాదియైన సాతాను తన గుణ గణాలను క్రీస్తు విరోధి లోనికి చొప్పించి అతనిని నాశన పుత్రునిగా మారుస్తాడు (యోహాను 17:12, 2థెస్స 2:3). ఇవి రెండు కూడా ఆది 3:15లో – అంతము వరకు స్త్రీ సంతానమునకును అపవాది సంతానమునకును వైరము అని చెప్పబడినట్లుగా ఈ క్రీస్తు విరోధి సాతానుని రూపంలో చేయబడినవాడు.

మానవ సహజ జన్యువును మరియు మానవ అసహజ జన్యువు మానవుడు గుర్తించే సరికి, దేవుడు ఆ మృగపు ముద్రను గురించి చేసిన హెచ్చరికను అర్ధం చేసుకునే సమయం చేజారి పోయి ఉంటుంది. ఈ ముద్రను పొందడం ద్వారా తాను బహు చర జీవిగా, మానవాతీతంగా మారతానని ఎవడైనను అనుకుంటె అంతకంటె ఘోరమైన శోధన మరొకటి ఉండదు. ఎప్పుడైన గ్రహాంతర జీవుల గురించి విన్నప్పుడు వారు ఏ విధమైన శోధనలో పడకుండ తామ మందను ప్రతి ఒక్క కాపరి హెచ్చరించవలసిన బాధ్యత ఉన్నది.

క్రొత్తగా ఎన్నుకొనబడిన పోప్ రోము కేథలిక్ విశ్వాసము మరియు పోప్ ఆధిపత్యం గురించి నొక్కి చెబుతుంటాడు. చివరకు ప్రపంచంలోని క్రైస్తవులందరి మీదను ప్రజలందరి మీదను తన అధికారమును జెసూట్స్ ఆశించిన విధంగా ప్రకటించును. ఆత్మీయ కుంచుకతను తొలగించె ప్రపంచ ఐక్యమతమును వెలుగులోనికి తెచ్చుటకు వివిధ మతాధికారులు దీని కొరకై తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. వారు ఎన్ని ఆలోచనలతో ముందుకు వచ్చిన పరలోకానికి వెళ్ళే మార్గము యేసు మాత్రమే (యోహాను 14:6, అ.కా. 4:12). ఈ దుష్ట లోకమునుండి విడిపింపబడి, నిరీక్షన సువార్తను ప్రకటించె మన తీర్మానాన్ని ప్రభావితం చేసే రాబోవు ఘటనల గురించిన జ్ఞానమును మనం నిర్లక్ష్యం చేయకూడదు. మనకు నిరీక్షణ కలదా? అవును కలదు.

## పరిశుద్ధ మరియు అపరిశుద్ధ సంఘము :

అంత్యదినములలో రెండు రకముల సంఘాలు ఉండునని దానియేలు ప్రవచనము చెప్పాడు. దానియేలు 12:1,2, 9,10

**1. ఆ కాలమందు నీ జనుల పక్షమున నిలుచునట్టి మహా అధిపతియగు మిఖాయేలు వచ్చును. అప్పుడు నీ జనులు రాజ్యముగా కూడిన కాలము మొదలుకొని ఈ కాలము వరకు ఎన్నటికిని కలుగనంత ఆపద కలుగును. అయితే నీ జనులలో గ్రంథమునందు దాఖలైన వారెవరో వారు తప్పించుకొందురు.**

**2. మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు. కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందలపాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు.**

**9. అతడు – ఈ సంగతులు అంత్యకాలమువరకు మరుగుగా ఉండునట్లు ముద్రింబడినవి గనుక, దానియేలూ, నీవు ఊరకుండుమని చెప్పెను.**

**10. అనేకులు తమ్మును శుద్ధిపరచుకొని ప్రకాశమానులును నిర్మలులును అగుదురు. దుష్టులు దుష్ట కార్యములు చేయుదురు గనుక ఏ దుష్టుడును ఈ సంగతులను గ్రహింపలేకపోవును గాని బుద్ధిమంతులు గ్రహించెదరు.**

దానియేలు గ్రంథమును దాని అనుబంధ గ్రంథమైన ప్రకటనలోను వ్రాయబడినదానిని అర్థం చేసుకొనుచు, పరిశుద్ధలుగను, మచ్చలేని వారుగ అంత్యదినములలో మార్చబడుదురని 9 మరియు 10వ వచనాలలో మనం చూస్తాము. కాని దుష్టులు దీనిని అర్థం చేసుకోలేరు. ఎందుకంటె బైబిలు చదవరు. అందులో యుగయుగముల కొరకు వ్రాయబడియున్న దేవుని ప్రణాలికను అపవాది తంత్రములను గ్రహింపరు. అదే సమయంలో నిజ సంఘము పరిశుద్ధపరచబడి, మచ్చలేనిదిగా శుద్ధిచేయబడును అయితె దుష్ట సంఘము ఇంకను నశించును (ప్రకటన 22:11).

సంఘము కొలిమివేయబడి శుద్ధిచేయబడుట ద్వారా రాకడలో విత్తబడని అవిశ్వాసుల వంటి చెత్త వేరు చేయబడి సంఘము శుద్ధీకరింపబడునని దానియేలుకు దూతద్వారా ఇవ్వబడిన సందేశం బోధ చేస్తుంది. అదే సమయంలో దుష్ట సంఘము ఇంకను పాపంలో కూరుకొనిపోవు. నిజంగా మారుమనస్సు పొంది రక్షింపబడిన విశ్వాసులు అంత్య దినముల గురించిన అవగాహన కలిగియుంటారు. కాని దుష్ట సంఘ విశ్వాసులు వీటిని గ్రహింపలేరు. అంతేకాక వారి రక్షణను నిర్లక్ష్యం చేస్తు ఇంకను దుష్టత్వంలో ఉంటు వాక్యపు హెచ్చరికలను పెడచెవిన పెడతారు.

మనము నివశిస్తున్న ఈ కాలం గురించి నీవు అర్థం చేసుకొనుటకు మరియు నిన్ను శుద్ధి చేయు ఉద్ధేశ్యంతో ప్రభువు ఈ హెచ్చరిక మాటలను నీకు పంపియున్నాడు.

రాకడ ఆలస్యమైన భవిష్యత్తులో మనం తెలుసుకోవలసిన జ్ఞానయుక్తమైన నిర్ణయాలను మూయబడిన తలుపుల వెనుక జరుగుచున్నవి ఇబ్బంది పెట్టనీయకుంటునట్లు వాటిని అలక్ష్యం చేయకుందుము. మానవుల యెడల దేవుని ప్రణాళిక ఏమైయున్నదో తెలుసుకొని విశ్వాసులు దీనులును, సాత్వికులును దేవుని వాక్యమందు సమయం గుడుపుతు ఆయన ప్రేమను కరుణను గ్రహిస్తారు. వారు లోక వార్తపత్రికలలో గూఢార్థములను గ్రహించెదరు.

మిమ్ములను ఆదరించె కొన్ని విషయాలు రాకడ సంబంధమైనవి మీకు గతంలో తెలియజేశాను. ఆయన కొరకు ఎదురు చూసేవారిని శ్రమ గడియలలో నుండి తప్పించి తీసుకొనిపోవుటకు యేసుప్రభువు వస్తాడు (ప్రకటన 3:10). అంత్య దినములలో సంభవించె వాటినన్నిటిని తప్పించుకొనుటకు పరిశుద్ధంగాను, పవిత్రముగాను ఉండమని హెచ్చరిస్తున్నాడు (లూకా 21:36). అన్ని వేళలలో ఈ వాగ్ధానములు మీ ఆలోచనలకు ముందు ఉండాలి. ఈ లోకములో జరుగు విషయాల సమాచారంతో మనం దుష్ట సంఘములో చేరకుండా జాగ్రత్త పడాలి. చీకటి జీవితంలో జీవించడం మంచిది కాదు. ఆయన మన జీవితానికి వెలుగు కాబట్టి ఎపుడు మన దృష్టి యేసు మీదనే కేంద్రీకరించాలి.

దేవుని కాపుదలనిచ్చు వాక్యమును నిరంతరం సాధ్యమైనంత కంఠత పెట్టు. దేవుడు మనలను తన అరచేతిలో ఉంచుకున్నాడు కనుక ఏది మనలను ఆయన నుండి లాగుకొనలేదు. భయమును ఆందోళనను తొలగించె వేలకొలది వాగ్ధానములు మనకున్నాయి. ఈ లోక నాశనం కొరకు సాతాను ఆడబోవు ఆట మీరు ఎరుగుదురు. కనుక ఈ అంత్య దినములలో మీరు మెలకువ కలిగి ఉండాలని నా ప్రార్ధన. అపవాదిని, వాని తంత్రములు మన ప్రభువుకు ముందే తెలుసు కాబట్టి మనం పట్టబడకుండా వాని ప్రయత్నములు అడ్డుకొనె అనేక లేఖన భాగాలను మనకు ఇచ్చాడని జ్ఞాపకం చేసుకుందాం.

మనము ఏమైయున్నామో జ్ఞాపకం చేసుకొనుడి. మరచిపోవద్దు. క్రీస్తు యేసు నందు మనకు జయం ఇస్తున్న తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదము.

**సమాప్తం**

## పాఠకులకు శుభవార్త

**'పరిశుద్ధత'** మాసపత్రిక ఇంటర్నెట్‌లో చదువుకొనే సౌకర్యము కల్పించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. వెబ్‌సైట్ పేరు **www.holinessmagazine.com.** ప్రస్తుతము మీరు 2014 సంచికలన్నీ డౌన్‌లోడ్ చేసు కొనవచ్చును. త్వరలో పాత సంచికలన్నీ ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించటానికి ప్రయత్నిస్తాము. అంతేకాక శ్రీమతి మాధురి మరియన్‌గారు పాడిన **'పరిశుద్ధ గీతములు' (Holi Melodies)** ఎనిమిది సి.డి.ల పాటలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మీరు ఈ పాటలను వినవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. త్వరలో **'పరిశుద్ధ ప్రవాహిని'** టి.వి. కార్యక్రమములో ప్రసారమయ్యే ప్రసంగాల వీడియోలను కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తేవాలన్న ఆలోచన ఉంది. ప్రార్థించండి. విదేశాలలో ఉన్న మీ బంధువులకు, స్నేహితులుకు తెలియజేయండి. దేవుడు మిమ్ములను దీవించును గాక!

**– ఎడిటర్**

# ఎలీసబెతు



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

యూదయ దేశపు రాజైన హేరోదు దినములలో అబీయా తరగతిలో ఉన్న జెకర్యా అను ఒక యాజకు డుండెను. అతని భార్య అహరోను కుమార్తెలలో ఒకతె. ఆమె పేరు ఎలీసబెతు (లూకా 1:5). యాజకుడైన జెకర్యా భార్య బహుకాలము గడిచిన వృద్ధురాలు. బాప్తిస్మమిచ్చు యోహాను తల్లి. కన్య మరియమ్మకు బంధువురాలు. ప్రపంచంలో పేరెన్నికగన్న మహిళామణులు ఎందరో ఎలీసబెతు అను పేరు ధరించినందు వలన ఈ పేరుకు ఇంతటి కీర్తిప్రతిష్టలు వచ్చాయి. ఎలీసబెతులోని అతి శ్రేష్టమైన గుణగణములను వాక్యము ద్వారా ధ్యానించు కుందాము.

**ఆమె నీతిమంతురాలు :**

వీరిద్దరూ ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పు నను, న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగా నడచు కొనుచు దేవుని దృష్టికి నీతిమంతులై యుండిరి (లూకా 1:6). నీతిమంతులుగా తీర్చబడటం అనేది దేవుని కార్యము. క్రీస్తునందలి విశ్వాసము ద్వారా ఆయన కృప వలన వారు ఉచితముగా నీతిమంతులుగా ఎంచబడ తారు లేక తీర్చబడతారు. అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెను. అయితే వీటన్నిటిని మించిన క్రీస్తు నీతిని మనము ధరించుకోవాలి. మనుష్యుల మెప్పును ఆశించకుండా దేవుని నీతిని పొందుకొని నిందారహితురాలిగా నీతిమంతురాలిగా ఎలీసబెతు భర్తతో కలసి దేవుని సేవలో ముందుకు కొనసాగుతున్నది.

**ఆమె గొడ్రాలు :**

ఎలీసబెతు గొడ్రాలైనందున వారికి పిల్లలు లేక పోయిరి. మరియు వారిద్దరు బహుకాలము గడిచిన వృద్ధులైరి (లూకా 1:7). నీతిమంతురాలుగా జీవించిన ఎలీసబెతుకు సంతానము లేదు. ప్రతి కీడు ఒక మేలు కొరకే అన్నారు పెద్దలు. ఇప్పుడు కీడు మేలుగా మార్చ బడుతుంది. జెకర్యా దేవుని సన్నిధిలో ధూపము వేయు చుండగా ప్రజా సమూహమంతయు వెలుపల ప్రార్ధన చేయుచుండగా దూత కనబడింది. జెకర్యా దూతను చూచి తొందరపడి భయపడ్డాడు. దూత – భయపడకుము నీ ప్రార్ధన వినబడినది. నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును. అతనికి యోహాను అను పేరు పెట్టుదువు. ఎలీసబెతుకు ఎంతో సంతోషము, ఆనందము. ఆయన సంతులేని దానిని ఇల్లాలుగాను, కుమాళ్ళ సంతోషముగల తల్లిగాను చేయును (కీర్తన 113:9).

**ఆత్మపూర్ణురాలు :**

అంతట ఎలీసబెతు పరిశుద్ధాత్మతో నింపబడినదై బిగ్గరగా ఇట్లనెను – లూకా 1:41. ఎలీసబెతు పరిశు ద్ధాత్మతో నింపబడిన స్త్రీగా మనం గమనిస్తున్నాము. జెకర్యా యింట్లో ప్రవేశించిన మరియ ఎలీసబెతుకు వందనము చేయగానే ఆమె గర్భములోని శిశువు ఆనందముతో గంతులు వేశాడు. వెంటనే పరిశుద్ధాత్మతో నింపబడిన ఎలీసబెతు మరియమ్మను ఉద్దేశించి "స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడినదానవు. నీ గర్భఫలము ఆశీర్వదింప బడును. నా ప్రభువు తల్లి నా యొద్దకు వచ్చుట నాకేలాగు

ప్రాప్తించెను. నీ శుభవచనము నా చెవిని పడగానే నా గర్భములోని శిశువు ఆనందముతో గంతులు వేసెను" అని పలికింది.

**దైవకనికరము పొంది ధన్యురాలు :**

ప్రభువు ఆమె మీద మహా కనికరముంచెనని ఆమె పొరుగు వారును విని ఆమెతో కూడ సంతోషించిరి (లూకా 1:58). ప్రసవకాలము వచ్చినప్పుడు ఎలీసబెతు కుమారుని కన్నది. ఆ కుమారుడు బాప్తిస్మమిచ్చు యోహాను. వృద్ధాప్యములో దేవుని మహా కనికరమును పొందిన ధన్యురాలు. ఎవరైతే ఆయనకు భయపడి ఆయన వాక్యమునకు విధేయులై లోబడి యుందురో అట్టివారిపై ఆయన కనికరము తరతరములకు ఉండును. ఎందుకంటే ఆయన కనికరము చూపుటయందు సంతోషించు దేవుడు. నీ యెడల నా యెడల కనికరముగల వాడై యున్నాడు. నీ సమస్య, పోరాటం ఎటువంటిదైనను కనికరముగల యేసు నిన్ను విడిపించుటకు సిద్ధముగా ఉన్నాడు. ఎలీసబెతుపట్ల మహా కనికరము చూపిన దేవుడు నీ యెడల, నా యెడల ఆయన కనికరము చూపుతాడు. ఆయనకు పక్షపాతము లేదు. ఆయన కృపాసనమును సమీపించి ఆయన మహా కనికరమును పొందుకొనుమని ప్రేమతో మనవి చేయుచున్నాను. దేవుడు మీకు తోడైయుండును గాక!

**గమనిక**

**'క్రిస్మస్'** పండుగ సందర్భముగా పాఠకుల నుండి కవితలు, కథలు కోరబడుచున్నవి. ఉత్తమ కవితలు, కథలకు బహుమతి కూడా ఉంటుంది. ఒక తావు (రెండువైపులా) మించకుండా వ్రాసి 30-11-2014 లోపు మాకు చేరేలా పంపించండి. లేదా స్కానింగ్ చేసి మా ఈ-మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. holiness.ierf@gmail.com

## బైబిల్ క్విజ్ - 3 జవాబులు

1. తెరహు
2. హారాను, నాహోరు
3. లోతు
4. శారాయి
5. ఊరు
6. 75 సంవత్సరములు
7. కనాను
8. అబ్రాము, లోతు పశువుల కాపరుల మధ్య వైరము
9. సొదొమ గొమొఱ్ఱా
10. హాగరు
11. ఐగుప్తు
12. ఇష్మాయేలు
13. 86 సంవత్సరములు
14. అబ్రాహాము
15. శారా
16. ఇద్దరు
17. సోయరు
18 ఉప్పుస్తంభము అయిపోయింది
19. 100 సంవత్సరములు
20. 90 సంవత్సరములు
21. మోరియా
22. 127 సంవత్సరములు
23. ఎలియాజరు
24. మిల్కా
25. బెయేర్షెబా

# నీవు అతి సుందరమైనదానవు



శ్రీమతి మాధురి మరియన్

పరిశుద్ధత పాఠకులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేయుచున్నాను. మీరందరూ బాగున్నారండీ. మీ క్షేమము కొరకు మేము ప్రార్థిస్తున్నాము.

యేసయ్యను ప్రేమించి ఆయనను వెంబడించిన స్త్రీలు పరిచర్య చేసిన స్త్రీలు పరిశుద్ధ గ్రంథములో కొంతమంది వున్నారు. అందుకే వారిని దేవుడు నీవు అతి సుందరమైన దానవు అని పిలుస్తున్నారు.

లూకా 8:36. ఆ ఊరిలో వున్న పాపాత్మురాలైన యొక స్త్రీ యేసు పరిసయ్యుని ఇంట భోజనమునకు కూర్చున్నాడని తెలిసికొని యొక బుడ్డిలో అత్తరు తీసికొని వచ్చి వెనుక తట్టు ఆయన పాదముల యొద్ద నిలువబడి ఏడ్చుచూ కన్నీళ్ళతో ఆయన పాదములు ముద్దు పెట్టుకొని ఆ అత్తరు వాటికి పూసెను. అక్కడ వున్న ఆ మహాభక్తులు మాత్రము ఆమె పాపాత్మురాలని, నీచమైనదని, అంటరాని దని ముద్రవేశారు. కాని ప్రభువు "నీవు నూనెతో నా తల అంటలేదుగాని ఈమె నా పాదములకు అత్తరు పూసెను. ఆమె విస్తారముగా ప్రేమించెను గనుక ఆమె యొక్క విస్తార పాపములు క్షమింపబడెనని చెప్పెను. ఈ స్త్రీ కూడా మనుష్యుల దృష్టిలో పాపాత్మురాలైనప్పటికిని దేవుని దృష్టిలో కృపకు పాత్రురాలైనది.

లూకా 2:36లో ఆషేరు గోత్రికురాలును పెనూయేలు కుమార్తెయైన అన్న అను ఒక ప్రవక్తి యుండెను. ఆమె కన్యాత్వము మొదలు ఏడు ఏండ్లు భర్తతో సంసారము చేసి బహుకాలము గడచినదై 84 సంవత్సరాలు విధవరాలై యుండి దేవాలయమును విడువక ఉపవాస ప్రార్థనతో రేయింబవళ్ళు సేవ చేయుచుండెను. ఆమె కూడా ఆ గడియ లోనే లోపలికి వచ్చి దేవుని కొనియాడి యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టుచున్న వారందరిలో ఈమెకు ఎంత ధన్యత లభించింది. ఈమె ఆయన దృష్టిలో ఎంతో సుందరమైనది. ప్రభువును కన్నులారా చూడగలిగినది. 84 సంవత్సరాల వరకు తన విశ్వాసమును కాపాడు కుంటూ ప్రభు పరిచర్యలో దేవాలయము విడువకుండా ఆయన పాదముల దగ్గర కనిపెట్టుకొని ఉన్న వృద్ధురాలు. కాని ప్రభువు దృష్టికి ఈమె ఘనురాలు. ఎంతో సుందరమైన స్త్రీ అని మనం కొనియాడ వచ్చును. ఆ సమయములో అక్కడ ఎంతోమంది స్త్రీలు ఉన్నప్పటికి అందరూ తమ సొంత పనులలో మునిగిపోయి ఉన్నారు. తీరిక దొరికి నప్పుడు పరిచర్యలో పాల్గొనేవారు ఉంటారు. కాని ఈమె మాత్రం దేవుడే తనకు ముఖ్యం, ఆయన ప్రత్యక్షతయే తనకు ముఖ్యం అనుకొని ఆమె విలువైన జీవితాన్ని ఆయన పాదముల దగ్గర పెట్టింది. దేవుని దృష్టిలో ఆమె సుందరమైనది.

యోహాను 4:6. అక్కడ యాకోబు బావి ఉండెను. యేసు ప్రయాణము వలన అలసియున్న రీతిగా ఆ బావి యొద్ద కూర్చుండెను. అప్పటికి ఇంచుమించు పండ్రెండు గంటలాయెను. సమరయ స్త్రీ ఒకతె నీళ్ళు చేదుకొనుటకు అక్కడికి రాగా యేసు నాకు దాహమునకిమ్మని ఆమెను అడిగెను. ఈ సమరయ స్త్రీ కొంతకాలముగా జీవజలముల కొరకు ఎదురు చూస్తూవుంది. ఈ సమరయ గ్రామంలో ఎంతోమంది స్త్రీలు ఉన్నప్పటికీ యేసుని గూర్చిన దాహం

ఎవ్వరికీ లేదు. అందరి దృష్టిలో ఆమె ఒక పనికిమాలిన స్త్రీగా ఉంది కాని దేవుని వెదకుటలో ఆమె మనసు ఎంతో పరుగులు తీస్తుంది. ఆయనకై వెదకుతుంది. వాక్యంలో వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును అని వ్రాయబడి వుంది. ఈమె వెదకింది గనుక ప్రభువు దృష్టికి ప్రియమైనది, సుందరమైనది.

నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు నేను వానికిచ్చు నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను. ఆ స్త్రీ ఆయనను చూచి అయ్యా, నేను దప్పిగొనకుండునట్లు చేదుకొనుటకు ఇంత దూరము రాకుండునట్లు ఆ నీళ్ళు నాకు దయచేయు మని అడిగెను. ఆ స్త్రీ తన బిందెను విడిచిపెట్టి అనగా నిత్యము ఊరెడి జీవజలములను తన హృదయములో నింపుకొని ఊరిలోకి వెళ్ళి నేను చేసినవన్ని నాతో చెప్పెనని సాక్ష్యము ఇచ్చిన స్త్రీ యొక్క మాటలనుబట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి. వెలివేయబడిన స్త్రీ యేసుని గూర్చి ప్రకటించుట వలన అతి సుందరమైనదిగా అందరి దృష్టిలో విలువైనదిగా ఉండెను.

లూకా 1:26. దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యక యొద్దకు దేవ దూత దేవునిచేత పంపబడెను. ఆ కన్యక పేరు మరియ. ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి దయాప్రాప్తురాలా నీకు శుభము ప్రభువు నీకు తోడై యున్నాడని చెప్పెను. దూత – మరియా భయపడకుము దేవుని వలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును.

ఒక పేద కుటుంబంలో నుండి వచ్చిన మరియకు అంతటి ధన్యత దొరికింది. దేవుని దృష్టిలో ఆమె అతి సుందరమైన విలువైన కుమార్తె. ఆయన మనసును యెరిగి ఆయన రక్షణకోసం కనిపెట్టుచున్న కన్యకలలో ఆమె ప్రత్యేకించబడిన కన్యక. ఆమెను సర్వోన్నతుని శక్తి కమ్ము కొనెను గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును. దేవుని కుమారుని తన గర్భములో మోసే భాగ్యం ఆమెకు లభించింది. రక్షణను ఈ లోకానికి అందించే ధన్యత మరియకు దొరికింది. హల్లెలూయా!


అందుకే ఎలీసబెతు అంటుంది, స్త్రీలలో నీవు ఆశీర్వదించబడినదానవు. నీ గర్భఫలమును ఆశీర్వదించ బడును. అందుకు మరియ "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. ఆయన తన దాసురాలి దీనస్థితిని కటాక్షించెను. ఇది మొదలుకొని అన్ని తరముల వారును నన్ను ధన్యురాలు అందురు."

దేవుడు మిమ్మును ఆశీర్వదించును గాక!

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తిగలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు ప్రతినెల రూ. 58/– ల నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవ కథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

# దేవుడు పండుగల ద్వారా మాట్లాడును




చాలాకాలం క్రితం దేవుడు మన లోకమును చేయక మునుపే, యేసుక్రీస్తునందు తన స్వంత వారుగా ఉండుట కొరకు కొంతమంది ప్రజలను ఎంపిక చేసుకున్నాడు. బైబిలు గ్రంథము చెబుతుంది, "యేసుక్రీస్తు ద్వారా... మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని, జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసి. 1:4-6). అనాది కాలములో దేవుడు తన ప్రజలను ఎంపిక చేయడము మాత్రమే కాకుండా, వారి నిమిత్తము నిత్యత్వము కొరకు ఒక గొప్ప ప్రణాళికను బయలుపరచుటకే దేవుడు ఇశ్రాయేలీయుల యెదుట ఏడు పండుగలను పెట్టాడు.

దేవుడే స్వయముగా ఆ ఏడు పండుగలను నియమించాడు. లేవీయకాండము 23:1-44లో వాటిని మనము చూస్తాము. ఈ పండుగలకు ప్రజలు కూడివచ్చి ఆరాధించునట్లు, కలసి సంతోషించి, ఉత్సవము జరుపు కొనుటకు వీలుగా దేవుడు వారికి సెలవు దినాలు ఏర్పాటు చేశాడు. ఇశ్రాయేలీయులు పండుగలన్నిటిని సంతోష ముగా జరుపుకొనేవారు. కాని ఒక పండుగ ప్రాయశ్చిత్తార్థ పండుగ మాత్రం దుఃఖించుటకు నియమించబడినది.

## ఏడు పండుగలు :

1. పస్కా పండుగ
2. పులియని రొట్టెల పండుగ
3. ప్రధమ ఫలముల పండుగ
4. పెంతెకోస్తు లేదా కోత పండుగ
5. బూరల పండుగ
6. ప్రాయశ్చిత్తార్థ దినము (యామ్‌కిప్పూర్)
7. పర్ణశాలల పండుగ

ఈ పండుగలన్నీ ప్రవచనాత్మకమైనవి మరియు ఇశ్రాయేలీయుల చరిత్రలో ప్రాముఖ్యమైన సంఘటనలను స్మరింపజేయునటువంటివి. అవి యేసుక్రీస్తు ప్రభువు వారి జీవితము, ఆయన కార్యములను అన్ని యుగములకు తెలియజేయునట్టివి. ఈ పండుగలు యేసుక్రీస్తునకు ఆయన జీవితము, పరిచర్యలకు ఛాయా రూపకముగా ఉన్నాయి.

**పస్కా పండుగ** :

పస్కా గొఱ్ఱెపిల్లకు, పస్కా నెరవేర్పుకు ప్రభువైన యేసుక్రీస్తే పరిపూర్ణమైన చిహ్నము. రాబోవు రక్షకునికి ప్రవచనాత్మకమైనటువంటి సూచన ఈ పస్కా ఆయనిచ్చే రక్షణ, విమోచన ఇది చూపిస్తుంది. యేసుక్రీస్తు ప్రభువు చిందించిన రక్తమునుబట్టి ఒక వ్యక్తి దేవుని తీర్పునుండి తప్పించుకుంటాడు. యోహాను 1:29లో "ఇదిగో లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని యోహాను యేసుప్రభువును పరిచయం చేశాడు. పౌలు, గలతీ. 1:4లో ఆయన గురించి ఈ విధముగా చెప్పాడు, "మన తండ్రియైన దేవుని చిత్తప్రకారము క్రీస్తు మనలను ప్రస్తుతపు దుష్టకాలములో నుండి విమోచింపవలెనని మన పాపముల నిమిత్తము తన్ను తాను అప్పగించుకొనెను" యెషయా 53:5-7లో, యెషయా ఆయనను గూర్చి ఇలా ప్రవచించాడు, "మన యతిక్రమ క్రియలనుబట్టి అతడు గాయపరచబడెను, మన దోషములనుబట్టి నలుగగొట్ట బడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను.

అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మనయందరి దోషమును అతని మీద మోపెను. అతడు దౌర్జన్యము నొందెను బాధింపబడినను అతడు నోరు తెరవలేదు వధకు తేబడు గొఱ్ఱె పిల్లయు బొచ్చు కత్తిరించు వారి యెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండు నట్లు అతడు నోరు తెరువలేదు.

మొదటి వ్యక్తి అయిన ఆదాము నుండి నాలుగువేల సంవత్సరాలు గడిచిన తరువాత ఈ భూగ్రహము మీద యేసు రాకడ చోటు చేసుకుంది. నిర్గమ 12:3,6 వచనములలో వివరించబడినట్లు పస్కా పండుగను గూర్చిన సమయము, ఇతర వివరములు దేవుని ద్వారానే నిర్ణయించబడి, ప్రకటించబడ్డాయి. "మీరు ఇశ్రాయేలీ యుల సర్వసమాజముతో ఈ నెల దశమినాడు వారు తమ తమ కుటుంబముల లెక్క చొప్పున ఒక్కొక్కడు గొఱ్ఱెపిల్లనైనను, మేకపిల్లనైనను తీసుకొనవలెను" (వ3). "నిర్దోషమైన ఏడాది మగపిల్లను తీసుకొనవలెను. గొఱ్ఱెలలో నుండియైనను, మేకలలో నుండియైనను దాని తీసికొన వచ్చును. ఈ నెల పదునాల్గవ దినము వరకు వారు దానినుంచుకొనవలెను. తరువాత ఇశ్రాయేలీయుల సమా జము వారందరు తమ తమ కూటములలో సాయంకాల మందు దానిని చంపవలెను" (వ. 6,7).

ఈ రెండు వచనాలలో గొఱ్ఱెపిల్ల నాలుగు దినములు ఉంచబడిన పిమ్మట చంపబడినట్లు మనము చూడ గలము. నాలుగు దినములు అనగా నాలుగువేల సంవ త్సరములు. దేవుని దృష్టికి వెయ్యి సంవత్సరములు ఒక దినముతో సమానము. "ప్రియులారా, ఒక సంగతి మరచి పోకుడి, ఏమనగా ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరములవలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినమువలెను ఉన్నవి" (2పేతురు 3:8). కీర్తనలు 90:4 కూడా దీనిని రూఢి పరుస్తుంది. ఆదాము నుండి నాలుగు వేల సంవత్సరములు గడచిన తరువాత యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకానికి వచ్చాడు. పస్కా పండుగ ద్వారా సూచించిన విధంగా యేసుప్రభువు దేవుని గొఱ్ఱెపిల్లగా ఆ పండుగ దినమున సాయంకాల సమయములో తన ప్రాణమర్పించాడు. యేసుక్రీస్తు ప్రభువు దేవుని గొఱ్ఱెపిల్లగా మరణించవలసినట్లు చూపిస్తున్న ఆ పస్కా పండుగను ఇశ్రాయేలీయుల గ్రహింపక, ఆ పండుగ దినమున తాము సిద్ధపరచిన గొఱ్ఱెలను వధిస్తూ ఉన్నారు. యేసుప్రభువు మరణించింది ఖచ్చితంగా ఆ పస్కా పండుగ దినముననే. అందులో ఏ మార్పు లేదు. ఈ పండుగ, సిలువపై ఆయన యొక్క మరణమును సూచిస్తుంది. క్రీస్తు యొక్క ఆ గొప్ప సిలువ త్యాగమునందు నమ్మిక ఉంచిన వారు దేవుని తీర్పు నుండి తప్పించుకోవచ్చు. "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 5:24).

దేవుడు మోషేకు ప్రత్యక్షమై తాను అబ్రాహాముతో చేసిన నిబంధన ప్రకారము, అబ్రాహాము సంతానమును ఐగుప్తు బంధకములలో నుండి విడిపించి కనానుకు నడిపించవలసిందిగా పంపాడు. కాని ఆ అబ్రాహాము నిబంధన వారి విడుదలకు ఉపయోగించలేదు. వారి దాసత్వము నుండిగాని, ఐగుప్తు నుండిగాని బయటకు వెళ్ళిపోవుటకు ఫరో నిరాకరించాడు. అప్పుడు దేవుడు కొన్ని అద్భుతాలు చేశాడు. కాని అవి కనీసము ఏ ఒక్కరిని కూడా ఐగుప్తు నుండి విడిపింపలేకపోయాయి. ఫరో యొక్క శక్తి నుండి ప్రజలను బయటికి తెచ్చుటకై నిబంధనేగాని, అద్భుతములేగాని, తీర్పులేగాని ఇవి యేవియు మోషేకు సహాయపడలేకపోయాయి. అయితే గొఱ్ఱెపిల్ల వధింపబడి, దాని రక్తము దేవుని ముందు కనబడినప్పుడు ప్రజలకు విడుదల వచ్చింది. (నిర్గమ. 12:21-27, 30-32).

**(సశేషం)**

# జర్మనీనందలి మొరావియన్ సువార్త ఉజ్జీవము

**జింజెన్‌డార్ఫ్ ప్రభువు (1727)**



**డా. విక్రాంత్ కొడవటికంటి**

సంఘ చరిత్ర అంతయూ చూచినట్లయిన యేసు ప్రభుని మిక్కిలిగా ప్రేమించువారు ఆయన సన్నిధి యొక్క ప్రాముఖ్యత ఎంతో అవసరముగా గుర్తించెడి వారు. జింజెన్‌డోర్ఫ్ ప్రభువు ఇట్టి తలంపు కలిగిన ప్రవక్తల వర్గమునకు చెందినవారు. క్రీస్తులో అన్యోన్య సహవాసము కలిగయుండుట క్రైస్తవ జీవితమునకు ఒక ప్రాముఖ్యమైన ప్రత్యక్షతగా జింజెన్‌డోర్ఫ్‌గారు తలంచెడివారు. ఈ ప్రభువుల వారి జీవితములో "ఆయన దీవెనకరమైన సన్నిధి" ఒక దహించెడు అంశముగా ఉండెడిది. వీరి యౌవ్వన దినములలో నుండే ఇప్పటి కాలములో ఎంతో ప్రసిద్ధికెక్కిన ఒప్పుకోలు, తన జీవితపు దీర్ఘకాల వాక్యముగా ఉండెడిది. "నాకున్న బలమైన ఆశ లేక ఆకాంక్ష యేసు మరియు యేసు మాత్రమే".

## ప్రార్థనాపరుడు :

జింజెన్‌డార్ఫ్‌గారికి క్రీస్తుపట్ల ఉన్న ప్రగాఢమైన ప్రేమయొక్క పర్యవసానము ఒక నిబద్ధత కలిగిన ప్రార్థనా జీవితము కలిగియుండుటయే జింజెన్‌డోర్ఫ్‌గారు ప్రభల మైన ప్రార్థనా రహస్యము తన జీవితపు తొలిదినములలోనే నేర్చుకొనియున్నారు. తన 16వ యేట హాల్లేనందున్న కాలేజిని వదలక పూర్వము తాను స్థాపించిన ప్రార్థనా గుంపులు లేదా 7 ప్రార్థనా సంస్థల పట్టికను ఫ్రాంకే అను ప్రముఖ ప్రొఫెసర్‌గారికి అందజేసెను. ఈ అత్యున్నతమైన మొరేవియన్ ఉజ్జీవమునకు పూర్వమే నిత్యనూతనమైన పరిశుద్ధాత్మ యొక్క క్రుమ్మరింపు కొరకైన ప్రార్థనలను ప్రోత్సహించెడి వారు. ఈ విధముగా జరిగిన ప్రార్థనల ఫలితమే 1727 ఉజ్జీవము అత్యున్నతమైనదని జాన్‌గ్రీన్‌ఫీల్డ్‌గారు అభివర్ణిస్తారు. ఈ విధముగా సంఘ చరిత్ర అంతటిలో 1727 సంవత్సరములో మొదలు పెట్ట బడిన అద్భుతకరమైన ప్రార్థనా ఉజ్జీవము 100 సంవత్స రాలు కొనసాగింపబడుట మరెచ్చటైనా చూడగలమా? దీనినే గంటల కొలది జరుగు విజ్ఞాపనగా గుర్తించారు. ఈ విధముగా సహోదరులు మరియు సహోదరీలు రిలే మాదిరిగా సంఘము యొక్క పని మరియు సంఘ అవసరతల కొరకై విడువక ఎడతెగక ప్రార్థన చేయుట అనునదియే దీని సారాంశము. బలముగా ప్రార్థన చేయు వ్యక్తి యొక్క ప్రభావము శక్తిహీనమైన సంఘమునకు విరుగుడుగా ఉన్నది. జింజెన్‌డోర్ఫ్ ప్రభువుగారి ప్రార్థనా జీవితము ఒక చిన్నతెగ లేక జాతిలో ఆగిపోలేదు. తుదకు ప్రపంచమంతయు ప్రార్థన జేయబడులాగున కొనసాగెను.

## గొర్రెపిల్ల కొరకైన ఆత్మలు :

జింజెన్‌డోర్ఫ్‌గారు యేసుప్రభువుపట్ల ఎంతటి ప్రగాఢమైన ఆశ కలిగియుండెడి వారో అంతటి ఆశ నశించు ఆత్మలపట్ల కలిగియుండెడివారు. ఒక మందు చున్న లేక జీవము కలిగిన ప్రేమ మరియు ప్రార్థనాశక్తి కలిగిన పిడికెడు అనగా బహుకొద్దిమంది ప్రవక్తల ద్వారా లోకమంతా సువార్తీకరణము చేయువలెనన్న ప్రగాఢ నిశ్చయత కలిగియుండేవారు. వారి నాయకునికి కలిగిన ఈ ధృఢమైన భావోద్వేగమును మొరేవియన్ సహోదర సహచరులు వెనుతీయక అంగీకరించెడివాడు. ఈ నూతనముగా స్థాపించబడిన, మిషనరీల కొరకైన ఆశ లేక అభిలాషను పేర్కొనుటకు ఒక ముద్రిక రూపించవలసి వచ్చెను. ఈ ముద్ర కెంపు లేక రక్తవర్ణములోనున్న

గొర్రెపిల్లను ఆధారము చేసికొని ఎత్తబడిన పునరుత్థానపు సిలువ, జయోత్సాహముతో కూడిన ధ్వజముగా ఎత్తబడి ఈ క్రింది దీక్షావాక్యము కలిగియుండెను. మన గొర్రెపిల్ల జయించెను. అతని వెంబడించెదము రండి. సువార్తను లోకమంతటికి అందించవలసిన బాధ్యతగలవారుగా తమ్మును తాము లోకమునకు ఋణస్థులుగా ఈ మొరేవియన్‌లు భావించెడివారు. స్వయమును ఉపేక్షించు కొని, త్యాగము, విధేయత కలిగిన జీవనశైలిని స్వీకరించు వారుగా ఉండవలెనని నొక్కి చెప్పబడెదరు. కార్యమును ఆరంభించుటలో పట్టుదల బోధించెడివారు. గొర్రెపిల్ల పిలుపునందుకొనిన వారు మొట్టమొదటిసారిగా వెళ్ళు నప్పుడు ఎంతటి కఠినమైన, హీనమైన ప్రాంతములకైనను వెళ్ళగలిగిన వారుగా ఉండవలెనని నొక్కి చెప్పబడెదరు. కార్యమును ఆరంభించుటలోని పట్టుదల శ్రమలలో సహనము, కష్టములలో ధైర్యము మరియు క్రీస్తు కొరకు, నశించు ఆత్మల కొరకు ఉన్న సమర్పణ విషయంలో ఆ సిలువ సైనికుడు కూడ మొరేవియన్ సహోదరులను అధిగమించలేదు.

**ప్రపంచ సౌవార్తీకరణకై పురికొల్పుట :**

1791వ సంవత్సరపు సౌవార్తీకరణ నివేదికలో మొరేవియన్ మిషను కొరకు వారికున్న ప్రేరణను ఎంతో అందముగా వివరించిరి. వారి సహోదరులను దూరపు ప్రాంతములకు మిషనరీలుగా పంపుటయందు యేసుక్రీస్తు అను రక్షకుని సువార్త అందరికి అందరించుటలో ఒక తీక్షణమైన కోరిక కలిగియుండిరి. సాతాను బంధకము లలో మరియు పాపదాస్యపు కాడిక్రిందను చీకటిలో కూర్చుండి మూలుగుచున్న వేవేలమంది ప్రజలను గూర్చి వినినప్పుడు వారు ఎంతో దుఃఖితులైరి. దేవుని వాక్య మందలి మహిమకరమైన వాగ్ధానములనుబట్టి క్రీస్తుయొక్క మరణము మరియు శ్రమలకు అన్యులు తగిన బహుమాన ములు అని తలంచిరి. ప్రభువైన యేసుక్రీస్తు ఆజ్ఞను అనుసరించి పూర్ణ నిశ్చయముతో మరియు విధేయతతో భూలోకమంతటికి సువార్తను ప్రకటించుటలో ప్రభువు నందు తన ప్రయాస వ్యర్థము కాదని జ్ఞాపకము చేసుకొనెడి వారు. వారికున్న అల్పమైన విధానములు మరియు అర్హత లనుబట్టి దిగులునొందెడి వారు కారు. వారు అన్యుల రక్షణ కొరకై ఎంతో ఆశ కలిగి శ్రమలు సహించుచూ, అవసరమై ప్రాణము పోవునంతగా ప్రయాస పడుటకు నిశ్చయించుకొనిరి. అయిననూ పాపములో జీవించు చున్న సహోదరుల కొరకై రక్తము కార్చిన రక్షకుడైన యేసుపట్ల వారికున్న ప్రేమ వారి విచారకర పరిస్థితుల న్నిటిని అధిగమించునట్లుగా చేసెను. వారు దేవుని యందలి శక్తితో ముందుకు కొనసాగిపోవుచుండగా ప్రభువు వారి పక్షమున అనేక అద్భుత కార్యములు చేయుచుండెను. మానవాళి అంతయు రక్షకుడు ప్రేమిం చుట ద్వారానే ఇతరులను ప్రేమించగలరు అను రహ స్యము మొరేవియన్‌లు ఎరిగియున్నారు. 1732 అక్టోబర్ 8న ఒక డచ్ ఓడ కోపెన్‌హాగన్ హార్బర్ నుండి డానిష్ వెస్టిండీస్‌కు బయలుదేరి వెళ్ళెను. ఆ నౌకయందు మొట్ట మొదటి మిషనరీలు కుమ్మరిపని చేయు జాన్‌వెనార్ట్ డాబర్ మరియు వడ్రంగిపని చేయు డేవిడ్‌విట్స్‌మన్ ఈ ఇద్దరు మిషనరీలు ఎంతో నేర్పుగలవారై వెస్టిండీస్ నందున్న బానిసలను కలుసుకొనుటకు, తమ్మును తాము బానిసత్వమునకై అమ్మబడుటకును సిద్ధపడినవారైరి. తెరచాపలు ఎత్తబడి ఓడ కదలుచున్న సమయములో “తాను పొందిన శ్రమలకు బహుమానం పొందుటకు గొర్రెపిల్ల యోగ్యుడు” అని వారి రణరంగపు కేక అందరి మిషనరీలు కేకగా ఉండునని ఎలుగెత్తి చాటిరి.

**వారు అన్నిటిని సమిష్టిగా పంచుకొనిరి :**

జింజెన్‌డోర్ఫ్‌గారికి కలిగిన మరియొక దర్శనమే మనగా అది అపొస్తలిక్ సంఘమును తిరిగి సమకూర్చు టయే. ఒకరినొకరు ప్రోత్సహించుకొని, సహాయము చేసుకొని, ప్రేమించి ఇతరులపట్ల పూచికత్తు కలిగిన అపొస్తలిక్‌గా తన్ను తాను ఉపేక్షించుకొనుట త్యాగము

విధేయత కలిగిన జీవనశైలిని స్వీకరించు వారుగా ఉండవలెనని బోధింపబడెడివారు. చాలమట్టుకు హెర్న్ హట్ అను కుగ్రామమందు జింజెన్‌డోర్ఫ్‌గారి దర్శనము కార్యరూపము దాల్చెను. అందరము ఒక్కటే సంఘము అను లోతైన గ్రాహ్యము కలిగినవారై చిన్నగుంపుల ద్వారా ఒకే అవసరతలు ఒకే ఆసక్తి మరియు ఐక్యపరచు కీర్తనలు మరియు ఎడతెగని ప్రార్ధన కూటములు కలిగియుండిరి. 1738వ సంవత్సరమున జాన్‌వెస్లీగారు ఈ సంతోష భరితమైన ప్రాంతమును దర్శించినపుడు ఎంతో ముగ్ధులై తన దినచర్య పుస్తకమునందు ఈ విధముగా వ్రాసికొనిరి. “నా జీవితకాలమంతయు ఇచ్చట సంతోషముగా గడిపి యుందును. సముద్రము నీటిలో కప్పబడినంతగా ఈ భూమిని క్రైస్తవ్యము ఎప్పుడు నింపును?”.

**దేవునికి సమీపముగా నుండుట తప్ప అతనికి మరియొక ఆనందము లేదు :**

ఏ విధముగా చూచిననూ జింజెన్‌డోర్ఫ్‌గారి జీవితం మచ్చలేక లోపము లేనిదిగా ఉండెను. దేవునిపట్ల దహించు నంతగా అతనికున్న ఆశ మరియు ప్రభువైన యేసుక్రీస్తు ప్రేమకు కట్టుబడియుండుట చూడగా ఎవరైననూ కదల్చ బడే వారు. ఈ క్రింది ఉత్తరము ద్వారా జింజెన్‌డోర్ఫ్‌గారికి యేసుపట్ల ఉన్న దహించునట్టి ప్రేమ యొక్క దర్శనము చూడగలము. మనము రక్షణను ప్రకటించు పద్ధతి ఈ విధముగా నుండెను. 1) ప్రతి ఒక్కరి హృదయము తట్టు మన కొరకై మరణించిన ప్రేమగల గొర్రెపిల్లను ఎత్తి చూపుట దేవుని కుమారుడైయున్నప్పటికి మన పాపముల నిమిత్తము సజీవయాగముగా సమర్పించు కొనెను. 2) యేసు రక్తమును గురించి బోధించుట మరణము వరకు యేసుక్రీస్తు చూపిన ప్రేమ. 3) ప్రేమయైన గొర్రె పిల్లను గురించి తప్ప వేరే సంగతి ఎత్తకుండా ఉండుట. 4) ఆయనను గూర్చి ఆయనయందున్న లేక ఆయనకు సంబంధించిన ఏ సద్గుణమును తప్పించి వేరొకటి పేరె త్తకుండా ఉండుట. 5) ఆయనయందు విశ్వాసముంచు అను ఆజ్ఞ తప్పించి మరియొకటి బోధించకుండా ఉండుట. 6) ఆయన మన కొరకు చేసిన ప్రాయశ్చిత్తము కంటే వేరొక సమర్ధించగలిగిన న్యాయము లేదని చెప్పుట. 7) పాప విముక్తిని లేక పరిశుద్ధునిగా చేయునది మరి యొకటి లేదుగాని ఇకను పాపము చేయనని, ఆధిక్యత కలదని దేవునికి సమీపముగా ఉండుట కంటే మరి ఎక్కువ సంతోషము దేనియందును లేదని. 8) ఆయనను తలంచుచు ఆయనకు ఇష్టమగు పనులు చేయవలెనని 9) ప్రభువగు క్రీస్తును, ఆయన అనుగ్రహించు దీవెనలను పోగొట్టు కొనుట కంటే మించిన పరిత్యాగము లేదని 10) క్రీస్తునందు తప్ప మరి ఎచ్చటనూ జీవమును పొందలేమని అతడు విశ్వసించెను.

జింజెన్‌డోర్ఫ్‌గారి విజయము క్రీస్తును గూర్చి అత్య ధికమైన ఆసక్తి వలన లభించినదైయుండెను. అదే విధ ముగా నేటి నవీన సంఘము యొక్క పతనము కూడా వారి ఆత్మల ప్రేమికుడైన క్రీస్తు యెడల వారికున్న అసం పూర్ణమైన శ్రద్ధ. ఈ దినములలో కూడ యేసు ప్రభువు ఈ విధముగా నిలిచి మొర్రపెట్టుచున్నాడు. అయిననూ మొదట నీకుండిన ప్రేమను నీవు వదలితివని, నేను నీ మీద తప్పు ఒకటి మోపవలసియున్నది. నీవు ఏ స్థితిలో నుండి పడితివో అది జ్ఞాపకము చేసుకొని మారుమనస్సు పొంది ఆ మొదటి క్రియను చేయుము” (ప్రకటన 2:4.5).

అటువంటి ఉజ్జీవము దేవుడు మన దేశములో కూడా దయచేయును గాక! ఆమేన్!!

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

# మదర్ థెరెసా



శ్రీమతి రిబ్కా విక్రాంత్

గుండెనిండా కరుణ మూర్తీభవించిన మానవత్వంగల మదర్‌థెరెసా యుగొస్లేవియాలోని స్కాపెజ్ గ్రామములో 1910 ఆగష్టు 26న జన్మించినది. ఆమె అసలు పేరు ఆగ్నేష్‌గోన్‌షా జోజాక్లువు. అందరూ ఆగ్నెస్ అని పిలిచెడి వారు. ఈమె తల్లిదండ్రులు అల్బేనియాకు చెందినవారు.

ఆగ్నెస్ చిన్ననాటి నుండియే దయార్ధహృదయురాలు. ఒకరోజు పెద్ద జ్వరముతో బాధపడుతూ, చలికి వణకుచు రోడ్డుమీద దిక్కు మొక్కు లేకుండా పడివున్న ఒక స్త్రీని చూచి జాలిపడి ఆమెను తన ఇంటికి తీసుకొని వచ్చి తన తల్లి, తాను ఆమెకు సేవచేసిరి.

క్రీస్తు ప్రభువు బోధించిన ప్రేమ, సేవ మమత, సుహృద్భావము ఆమెకు అత్యంత ప్రియములు. వీటిపైననే తన భవిష్యత్తుకు ఆమె పునాదులు వేసుకొన్నది. తన స్కూలు జీవితములోనే "సొడారిటి" అనే మత గ్రంథాలు చదువుచు తానొక మిషనెరీగా వెళ్ళి ఏ దేశములోనైనా సేవ చేయాలను కొన్నది. 18 సంవత్సరాలైనా నిండని ఆగ్నెస్ క్రైస్తవ మత సన్యాసినిగా చేరినది. 1928లో డబ్లిన్ నగరముచేరి భారతదేశానికి రాకముందు ఇంగ్లీషు నేర్చుకొని డార్జిలింగ్ చేరుకున్నది. అక్కడ లొరెటో సిస్టర్లు నడిపించే స్కూలులో చరిత్ర, భూగోళము పాఠాలు బోధించేది. డార్జిలింగ్‌లో ఆగ్నెస్ పేరును థెరెసాగా మార్చుకొన్నది. బెంగాలులోని ప్రజల దుస్థితి ఆమె హృదయాన్ని కలచివేసెను. 1948వ సంవత్సరములో కలకత్తా చేరుకొని, అక్కడి పెదరికాన్ని, అజ్ఞానాన్ని చూచి చలించిపోయింది. కలకత్తా ఆర్చిబిషప్ ఈమె సేవను మొదట గుర్తించకపోయినా, ఆమె సేవాసక్తిని చూచి తరువాత గుర్తించాడు.

కుష్టురోగుల మధ్య నిరుపేదల మధ్య తాను సేవ చెయ్యాలని మదర్ థెరెసా నిర్ణయించుకొనెను. తరువాత పాట్నా వెళ్లి అమెరికన్ మెడికల్ మిషనెరీ సిస్టర్స్ దగ్గర మూడు నెలలు శిక్షణ పొందెను. చిన్నచిన్న జబ్బులకు మందులు వాడుట, ఇంజెక్షనులు ఇచ్చుట మొదలైన (నర్సులుచేసే) పనులలో శిక్షణపొంది తిరిగి కలకత్తాకు వచ్చి లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ది పూర్ అనే మత కన్యకల యొద్దకు వెళ్ళినది. ఈ కాలములోనే నీలం అంచులుగల ముతక చీరలను ధరించుట వీరు ప్రారంభించిరి. మెడలో చిన్న సిలువను ధరించెడివారు. కొంతమంది స్త్రీలు ఆమెకు సాయపడగా వారికి సహృదయుల అండదండలు లభించెను.

అనాధ బాలలకు థెరసా ఒక ఆశ్రమము నెలకొల్పినది. తల్లి తండ్రిలేని నిర్భాగ్యులకు తానే తల్లియైనది. మోతిజీల్ అనే మురికివాడలో కార్పోరేషన్‌లో పనిచేసే పాకీ వారు, సఫాయి వారు మొదలైన పేదవారు నివసించెదరు. ఎవరి పనుల మీద వారు వెళ్ళిపోగా మిగిలిన పిల్లల బాగోగులను చూచేవారు ఎవరూ ఉండరు. అందుచేత మదర్ థెరెసా బాగోగులను ప్రత్యేకంగా వారికోసం ఒక బడిని ప్రారంభించెను. నెలకు అయిదు రూపాయలు అద్దెకడుతూ ఓ చిన్న పూరిపాకను బడికి ఉపయోగించెను. క్లాసులు బయటనే జరిగేవి. టీచర్లు వ్రాయడానికి కనీసం నల్లబల్ల పిల్లలకు పలకా బలపాలు కూడా ఉండేవి కావు. నేలమీద బురదలో అక్షరాలు దిద్దించేది. పిల్లలకు మధ్యాహ్నం పూట పాలు ఇప్పించే ఏర్పాటు చేశారు. ఆమె తన సేవానిరతి వలన 1916 భారతదేశ పౌరసత్వం పొంది భారతీయురాలుగా మారెను. కలకత్తాలో మైకెల్‌గోమ్స్ అనే ఆసామి మదర్‌కు

ఒక మేడగదిని బహూకరించాడు.

వేకువనే నాలుగున్నర గంటలకు లేవడం ఆరుగంటల కల్లా ధ్యానం ప్రార్థనలు, ఉదయకాలపు భోజనము ముగించు కొని బడికివెళ్ళి పిల్లలను పరామర్శించి అక్కడ నుండి మురికి వాడలలోకి వెళ్ళి నిరుపేదల మధ్య సేవచేయటం ఇది ఆమె దినచర్య. 1949 మార్చిలో సుభాషిణిబోస్ అనే బెంగాలీ వనిత ఆమె గదికి వచ్చి మదర్ నేను నీతోపాటే ఉంటాను. నన్నొక సేవికగా గ్రహించుమనగా, మదర్ "అమ్మా, ఈ జీవితం చాలా క్లిష్టమైనది. అందుకు నీవు సిద్ధపడియుండాలి" అనెను. అందుకావనిత అన్నిటికి సిద్ధపడి వచ్చాను. మదర్ నేనెప్పుడూ బాధపడను అని పలికెను. ఆ వనిత తన పేరును మదర్ థెరిసా పాతపేరైన ఆగ్నెస్‌గా మార్చుకున్నది. మదర్ విదేశాలకు వెళ్ళినప్పుడు ఆగ్నెస్ అక్కడి కార్యక్రమాలు చూసేది. అటు తరువాత సిస్టర్ గెర్‌ట్రాడ్, సిస్టర్ డోరతి, సిస్టర్ మార్గరేట్ మేరి అను మరో ముగ్గురు థెరెసా పరిచర్యలో చేరారు. కొంతకాలానికి మరి కొందరు చేరారు.

## మిషనెరీస్ ఆఫ్ ఛారిటి :

ఈ సంస్థను 1950లో పోప్ ఆమెదించారు. అనతి కాలంలోనే మదర్‌తో కలిసి మురికివాడల్లోనే సేవ చెయ్యాలని వచ్చే సేవికల సంఖ్య ఎక్కువైనది. మైకెల్‌గోమ్స్ రెండవ అంతస్తు కూడ మదర్‌కు ఇచ్చేశాడు. తనతో పని చేయుటకు వచ్చే సేవికలకు మొదట తర్ఫీదునిచ్చి, మురికి వాడలలోకి అక్కడ ఉన్న బడులలోకి, మందులిచ్చే ప్రదేశాలకు మరణించే గృహాలకు, కుష్ఠురోగులు, క్షయరోగుల యొద్దకు మరియు నిరుపేదల యొద్దకు పంపేది.

ప్రపంచములో రెండు కోట్లకు పైగా కుష్ఠురోగులుండగా అందులో దాదాపు 50 వేలు వరకు కలకత్తా పరిసరాల్లోనే ఉన్నారు. వీరి దీనస్థితి మదర్‌ను కదిలించినది. వారికోసం ఓ ఆశ్రమాన్ని నెలకొల్పాలనుకొన్నారు. భారత ప్రభుత్వం ఆశ్రమము కొరకు ఆమెకు నాలుగు ఎకరాల స్థలం ఇచ్చెను. ఈ ఆశ్రమంలో ఎంతోమంది కుష్ఠురోగులు ఆశ్రయం పొంది వ్యాధినివారణ చేసికొనిరి. ఇటువంటి కేంద్రాలు మరికొన్ని చోట్ల కూడా నెలకొల్పబడినవి.

## హోం ఫర్ ది డైయింగ్ :

కూడు, గూడు, నీడ లేక రోడ్ల మీదనే ప్రాణాలు విడిచేవారు కలకత్తాలో కోకొల్లలు. మదర్ ఇటువంటి అభాగ్యుల కొరకు ఒక ఆశ్రమము నెలకొల్పానుకుంది. "మరణించు అభాగ్యులను మరియు దిక్కు దెసలేని అనాధలను స్మర్శించి సేవ చేస్తుంటే ప్రభుయేసును స్పర్శించినట్లుగా అనుభుతి పొందుచున్నాను" అని మదర్ చెప్తుండేది.

## నిర్మల హృదయ :

మదర్ థెరిసా నెలకొల్పిన మరొక సంస్థ నిర్మల హృదయ. హృదయ ప్రక్షాళనము కొరకు ఇది ప్రధానంగా ఉద్దేశించబడినది. మరణావస్థలోనున్న పేదవారిని ప్రశాంతంగా చనిపోయేలా ఇక్కడికి తీసికొని వచ్చేది. వారు చేసిన పాపాలకు దేవుని క్షమాభిక్షకోసం ఆర్థించడం నిర్మల హృదయ యొక్క ముఖ్య ఉద్దేశ్యము. మదర్ దీని విషయమై పోలీసు కమిషనరునకు మనవి చేయగా కాళీఘాట్‌లో ఒక వసతిని చూపించాడు. మదర్ దానికి నిర్మల్ హృదయ అని నామకరణం చేశారు.

కాళీఘాట్‌లో నిర్మల హృదయ్ కాళికా దేవత గుడిని ఆనుకొనియున్నది. చనిపోయే వారిని అందులో ఉంచి స్నానాలు చేయించి ప్రార్థనలు చేసి ఆ శవాలను మార్చురీలో ఉంచి మున్సిపాలిటి వారికప్పగించటం కాళికా పూజారులకు కంటకమైనది. ఎంత వీలైతే అంత త్వరగా ఆమెను అక్కడ నుండి గెంటివేయాలని ఆలోచించి పదిమంది రౌడీలను వెంటబెట్టుకొని పూజారుల సలహా ప్రకారం ఒక రాజకీయ నాయకుడు "నిర్మల్ హృదయ"లో ప్రత్యక్షమయ్యాడు. ఆ సమయంలో అమ్మ ఒక రోగి పుండ్లను కడుగుచు కనిపించింది. ప్రాణాలు పోతున్న మరొకరి దగ్గరకు వెళ్ళి అతనిని ఓదార్చుతుంది. చనిపోయిన శవాలను సేవికలు కుడుగుచున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన ఆ రాజకీయ నాయకుని మనస్సు కరిగిపోయింది. ముంచుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుచు వెలుపలికి వెళ్ళి ఏడ్చాడు.

రౌడీలు "ఏదీ థెరిసా?" అని గర్జించారు. "నేను ఆమెను ఈడ్చుకొస్తానుగాని, మీ తల్లులు, అక్కలు, చెల్లెళ్ళు వచ్చి ఆమె చేస్తున్న సేవ చేయగలరా?" అనగానే వారు నివ్వెర పోయారు. అయితే ఆ కాళికా పూజారులంతటితో ఉపశమించలేదు. మదర్‌ను అక్కడ నుండి గెంటివేయాలనే ప్రయత్నంలోనే ఉన్నారు. ఒకరోజు ఒక కాళికా పూజారికి కలరా వచ్చింది. గుడిలోనే పడుకుంటున్నాడు. ఆ కలరా తమకు కూడా ఎక్కడ సంక్రమిస్తుందోన్న భయంతో ఏ పూజారి కూడా ఆయన దగ్గరకి రావడానికి సాహసించడం లేదు. ఈ విషయం మదర్‌కు తెలియగానే అక్కడకు వెళ్ళి ఆ కలరా సోకిన పూజారిని తన చేతులలోనికి తీసికొని ఊరడించి నిర్మల హృదయలోకి చేర్చగా తరువాత కొన్ని గంటలకే అతడు కన్నుమూశాడు. మరొక పూజారి నిర్మల హృదయలోనికి ప్రవేశించి అక్కడ జరుగుచున్న సేవా కార్యక్రమాలను తిలకించిన తరువాత చలించిపోయి అమ్మ దగ్గరకు వచ్చి "ముప్పది సంవత్సరాలుగా ఈ గుడిలో కాళిమాత సేవ చేస్తున్నాను. ఇప్పుడు నీవు మానవాకారంలో ఉన్న కాళీమాతవు" అంటూ ఆమె కాళ్ళమీద పడ్డాడు. ఆనాటి నుండి కాళికా పూజారులు అమ్మకు చేదోడు వాదోడుగా ఉండసాగారు.

**ఆంధ్రప్రదేశ్‌లో మదర్ థెరిసా :**

హైదరాబాద్‌లో కూడు, గూడు లేక రోగాలపాలైన దీనులకు ఒక ఆశ్రమం కల్పించాలని మొదట ఆర్చిబిషప్ అరుళప్ప ఆలోచించాడు. 1978 సెప్టెంబరులో ఆయన ఆహ్వానాన్ని పురస్కరించుకొని అమ్మ హైదరాబాద్ వచ్చింది. రెబెల్లో అనే ఆసామి తన భవనమును మదర్‌కు అంకితం చేశాడు. ఆనాటినుండి సిస్టర్ మోలి సిస్టర్ సుపీరియర్‌గా వ్యవహరిస్తూ అమ్మ సేవను కొనసాగించింది. ప్రస్తుతం ఇక్కడ ఒక శరణాలయము, ఒక కుష్ఠురోగుల ఆసుపత్రి, అనాధసేవ జరుగుచున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరములోనేగాక ఆయా జిల్లా కేంద్రాలలో కూడ నిర్మల హృదయ సంస్థలు నెలకొల్పబడ్డాయి. 1980 మార్చి 1న కాకతీయ విశ్వవిద్యాలయము వారు స్నాతకోపన్యాసము చేయుటకు మదర్‌ను వరంగల్‌కు ఆహ్వానించి గౌరవ డాక్టరేట్ బిరుదును ఆమెకు ప్రధానం చేసి సత్కరించారు.

మదర్ థెరిసా నిస్వార్ధ జీవితానికొక తార్కాణం – 1964లో యూఖరిస్తు కాంగ్రెస్ బొంబాయిలో జరిగినది. పోప్‌పాల్ ఆ సభలకు హాజరయ్యాడు. మనదేశంలో ఆయా స్థలాల్లో పర్యటించడానికి రెండులక్షల విలువైన కారును ఆయనకు బహుకరించారు. తన భారతదేశ యాత్రను, ఇతర కార్యక్రమాలను ముగించుకొని రోమ్‌కు తిరిగి వెళ్ళక మునుపు ఆయన ఆ కారును మదర్‌కు బహూకరించగా, ఆ కారుపై లాటరీ టిక్కెట్ల మీద నాలుగు లక్షలు పోగుచేసి మదర్ థెరిసాకు అప్పగించగా ఆ డబ్బును ఆమె పేదల సేవకు వినియోగించెను.

1972లో మదర్ థెరెసా అంతర్జాతీయ అవగాహనకు నెహ్రూ అవార్డు లభించింది. మదర్‌ను ప్రశంసిస్తూ అప్పటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఇలా అన్నారు, "నిర్విరామంగా, నిస్వార్ధంగా, మదర్ థెరిసా చేస్తున్న సేవ అద్భుతం! ఈ సేవ అందరూ చేయలేరు. ఈ సేవ మానవ హృదయాన్ని స్పందింపజేసే సేవ. రోగుల మధ్య, పేద ప్రజానీకం మధ్య చేసే ఈ సేవ మనలను విధేయులనుగా చేస్తున్నది". శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానిగానున్న కాలంలో 1972లో ఒక అపూర్వమైన కానుకను అమ్మకు ప్రసాదించింరి. మదర్ థెరిసా భారతదేశములో ఎక్కడికైనా సరే స్వేచ్ఛగా డబ్బు చెల్లించకుండా, విమానంలోగాని, రైలుబండిలోగాని ప్రయాణము చేయడానికి ఫ్రీపాసును ఇచ్చిరి. ఈ సదుపాయము అమ్మ సేవలకు ఎంతగానో తోడ్పడినది.

మదర్ థెరెసాకు లభించిన గౌరవ పురస్కారాలు మదర్ ప్రపంచానికి శాంతి సందేశమునందించిన మహనీయురాలు. కరుణ, జాలి, దయ నానాటికి కరువైపోతున్న ప్రపంచంలో మదర్ ఆశాజ్యోతిగా సేవలనందించారు. 120 దేశాల్లో 720 కేంద్రాలను నెలకొల్పి ప్రపంచంలోని నిరుపేదలను అక్కున చేర్చుకొన్నది మదర్ థెరెసా.



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 4

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. ఇస్సాకు భార్య పేరేమి?
2. ఇస్సాకు మామ పేరేమి?
3. రిబ్కా సోదరుని పేరేమి?
4. అబ్రాహాము తన వృద్ధాప్యములో వివాహము చేసికొనిన భార్య పేరేమి?
5. అబ్రాహాము జీవించిన సంవత్సరములు ఎన్ని?
6. ఇస్సాకు రిబ్కాను వివాహము చేసుకున్నప్పుడు ఎన్ని సంవత్సరముల వాడు?
7. ఇస్సాకు పెద్ద కుమారుని పేరేమి?
8. ఇస్సాకు చిన్న కుమారుని పేరేమి?
9. యాకోబు అను పేరుకు అర్ధమేమి?
10. ఇస్సాకుకు కుమారులు పుట్టినప్పుడు ఆయన వయస్సెంత?
11. అబ్రాహాము చనిపోయినప్పు యాకోబు వయస్సెంత?
12. యాకోబు వంట వండుచున్న కూర ఏమిటి?
13. వంటకము కొరకు ఏశావు ఏమి అమ్మివేసెను?
14. ఇస్సాకు ఏశావును ఆశీర్వదించుటకు ఏమి చేయమని చెప్పెను?
15. ఏశావు యాకోబు మీద పగపట్టుటకు కారణమేమి?
16. ఇస్సాకు యాకోబును ఎవరి దగ్గరకు వెళ్ళమని ఆజ్ఞాపించెను?
17. యాకోబు కల కనిన ప్రదేశమునకు ఏ పేరు పెట్టెను?
18. లోతు భార్యకు ఏమి జరిగినది?
19. లాబాను పెద్ద కుమార్తె పేరేమి?
20. రాహేలును పెండ్లి చేసుకొనుటకు యాకోబు మొత్తం ఎన్ని సంవత్సరములు లాబాను దగ్గర పనిచేసెను?
21. లేయాకు ఎంతమంది కుమారులు? వారి పేర్లేమి?
22. రాహేలు దాసి పేరేమి? ఆ దాసికి పుట్టిన కుమారుల పేర్లేమి?
23. లేయా దాసి పేరేమి? ఆ దాసికి పుట్టిన కుమారుల పేర్లేమి?
24. లేయా కుమార్తె పేరేమి?
25. రూబేను పొలములో ఏ వృక్ష ఫలములను చూచి తన తల్లికి ఇచ్చెను?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.